
ఈనాడు
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ

మంగళవారం అక్టోబరు 8, 2024



శక్తి స్వరూపిణి

అమలాపురం పట్టణం: దసరా ఉత్సవాలలో భాగంగా అమలాపురంలో శ్రీదేవి అమ్మవారిని లలితా త్రిపుర సుందరీదేవిగా అలంకరించారు..

భూ సమస్యకు పరిష్కారం

మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ ఫ్లెక్సీ

ఈనాడు, కాకినాడ: వైకాపా ప్రభుత్వంలో అన్యాక్రాంతమైన భూమి.. కూటమి ప్రభుత్వం వచ్చాక తిరిగి దక్కడంతో కాకినాడకు చెందిన వ్యాపారి చలికి వీరేంద్ర ఆనందం వ్యక్తంచేశారు. తెదేపా యువనేత, మంత్రి నారా లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ భారీ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. 'లోకేశ్ గారి ప్రజాదర్బార్‌లో నా భూమి సమస్య పరిష్కారమైంది.. కృతజ్ఞతలు తెలుపుతున్నాను' అంటూ ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ పలువురిని ఆకర్షిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో కాకినాడ కలెక్టరేట్‌లో భూ దస్త్రాలు దిద్దేసి.. వీరేంద్రకు చెందిన చీడీలపోర ప్రాంతంలోని ఎకరం భూమిని ఆక్రమించడం సంచలనం కలిగించింది. దీంతో లోకేశ్‌కు యువగళం పాదయాత్రలోను, ప్రభుత్వం వచ్చాక ప్రజా దర్బార్‌లోనూ సమస్య విన్నవించారు. సానుకూల స్పందన రావడంతో.. ఆక్రమిత భూమిని తిరిగి స్వాధీనం చేసుకున్న వీరేంద్ర.. ఆ స్థలంలో ఇలా ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు.



కాకినాడ చీడీలపోరలోని భూమి వద్ద ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ

పండగ వేళ.. వీరబాదుడు


ఆర్టీసీలో సాధారణం.. ప్రైవేటులో అధిక భారం

ఉమ్మడి జిల్లా మీదుగా సాగే ప్రైవేటు బస్సులు			ఉమ్మడి తూర్పులో ఇలా..	
ఆలిండియా పర్మిట్ ట్రావెల్స్ 61	దూర ప్రాంతాలవి 30	ఇతర ప్రాంత సర్వీసులు 80	ఆర్టీసీ డిపోలు 11	బస్ స్టేషన్లు 44
			బస్సుల సంఖ్య 901	పండగ వేళ రద్దీ సుమారు 10 లక్షలు

అమలాపురం నుంచి వివిధ ప్రాంతాలకు ఛార్జీలిలా..

ధర (రూ.లలో) ☛ ఆర్టీసీ → ప్రైవేట్

ప్రాంతం	ఆర్టీసీ	ప్రైవేట్
హైదరాబాద్	900-1,100	610-5,000
బెంగళూరు	----	1,990-2,800
శ్రీకాకుళం	620	890-999
విశాఖపట్నం	355-440	900-5,000
విజయవాడ	310-390	780-3,000
తిరుపతి	1,110	987-2,800



దసరా సెలవుల వేళ స్వస్థలాల్లో పండగ చేసుకోవడానికి రాకపోకలు ఊపందుకున్నాయి. ఓ ప్రణాళిక ప్రకారం ముందుగానే రిజర్వేషన్లు చేసుకొన్నవారు కొందరైతే.. ఇంకొందరు అప్పటికప్పుడు సిద్ధమవుతున్నారు. ఆర్టీసీ సాధారణ ఛార్జీలే వసూలు చేస్తుండగా ప్రైవేటు బస్సుల్లో బాదుడు తప్పడంలేదు. డిమాండ్ ఆధారంగా ధరలు పెంచేస్తున్నారు. పండగ అటు ఇటు రోజుల పరిస్థితి చూస్తే టికెట్టా.. రాకెట్టా.. ? అన్నంతగా ఉంది.



ఈనాడు, కాకినాడ

కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల నుంచి దూర ప్రాంతాలకు పండగ వేళల్లో లక్షల మంది వెళ్తారు. ఉపాధి, ఉద్యోగరీత్యా ఇతర జిల్లాలు, రాష్ట్రాలు, దేశాల్లో ఉన్నవారు సైతం ఇక్కడికి పెద్ద ఎత్తున వస్తుంటారు. కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం, రావులపాలెం, తుని, పెద్దాపురం, పిఠాపురం, సామర్లకోట, యానాం నుంచి ప్రైవేటు బస్సులు దూరప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నాయి. చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, తిరుపతి, విజయవాడ, విశాఖ, శ్రీకాకుళం ప్రాంతాలకు ప్రైవేటు ట్రావెల్స్ సేవలు ఉన్నాయి. తాకిడి ఆధారంగా ధరలు పెంచేస్తున్నారు.

నిఘా ఎక్కడుంది?

■ ఉమ్మడి జిల్లాలో రవాణాశాఖ చెక్‌పోస్టు గతంలో తుని మండలం తేటగుంట వద్ద ఉండేది.. వైకాపా వచ్చాక బెండపూడి ప్రాంతానికి మార్చారు. ఎన్నికలకు ముందు దీంతోపాటు రాష్ట్రంలోని 18 చెక్‌పోస్టులూ ఎత్తేశారు. వాహనాలపై నిఘా ఉంచామని అధికారులు చెబుతున్నా.. ప్రత్యేక డ్రైవ్‌లు, తనిఖీలు లేవు. ఈ పరిస్థితుల్లో ఫిట్‌నెస్ లేని బస్సులు రోడ్లపైకి వచ్చే ప్రమాదమూ ఉంది. పండగ రోజుల్లో అధిక ఛార్జీల వసూళ్లతోపాటు.. ప్రయాణికుల భద్రతపైనా దృష్టిసారించడం మేలు.

అతిక్రమిస్తే చర్యలు



సాధారణ రోజులతో పాటు.. పండగ సీజన్ లోనూ వాహనాలు తనిఖీ చేస్తున్నాం. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు పెడతాం. ఉమ్మడి జిల్లాలోని చెక్‌పోస్టు ఎత్తివేసినా.. కీలక మార్గాల్లో నిఘా ఉంది. ఆన్‌లైన్‌లో, క్షేత్ర స్థాయిలో పరిశీలించి అధిక ఛార్జీలు వసూలు చేయకుండా చర్యలు తీసుకుంటాం.

- కె.శ్రీధర్, ఉప కమిషనర్, రవాణాశాఖ, కాకినాడ జిల్లా

సత్యదేవుని ప్రసాదానికి విజయ నెయ్యి

అన్నవరం: అన్నవరం సత్యదేవుని గోధుమ నూక ప్రసాదం తయారీకి విజయవాడలోని విజయ డెయిరీ నెయ్యి వినియోగించనున్నారు. ఆలయాల్లో వినియోగించే నెయ్యి నాణ్యతపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇంతవరకు సరఫరా చేసే గుత్తేదారు గడువు సెప్టెంబరు 30తో ముగియడంతో కొత్త వారికి ఇంకా అనుమతి ఇవ్వలేదు. దేవాదాయశాఖ మార్గదర్శకాలు వచ్చే వరకు తాత్కాలికంగా విజయ నెయ్యి తీసుకుంటారు. ముందుగా 300 డబ్బాల నెయ్యి (4,500 కేజీలు) అన్నవరానికి వచ్చింది. మరో 150 డబ్బాలు మంగళవారం రానున్నాయని తెలిసింది. దేవాదాయశాఖ నుంచి మార్గదర్శకాలు వచ్చిన తర్వాత పూర్తిస్థాయిలో ఎక్కడి నుంచి కొనుగోలు చేయాలో తుది నిర్ణయం తీసుకుంటారు.

బీచ్ పార్కులో పర్యాటకాభివృద్ధికి చర్యలు

సర్పవరం జంక్షన్: కాకినాడ సముద్ర తీరంలో పర్యాటకాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని, దీనికోసం ప్రత్యేకంగా ప్రణాళికలు సిద్ధంచేశామని ఏపీ టూరిజం ఛైర్మన్ నూకసాని బాలాజీ తెలిపారు. సోమవారం ఆయన సూర్యారావుపేట సముద్ర తీరంలోని ఎన్టీఆర్ బీచ్‌పార్కును సందర్శించారు. పర్యాటకులకు అందుతున్న సౌకర్యాలు, అభివృద్ధి పనులను అధికారులతో కలిసి పరిశీలించి సూచనలు చేశారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో స్వదేశీ దర్శన్, ప్రసాద్ వంటి పథకాలతో పర్యాటకం, ఆధ్యాత్మిక పర్యాటకాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని, వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి నూతన పాలసీ అమలుచేసేలా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తోందని తెలిపారు. బాలాజీ బీచ్ ఫ్రంట్ పార్కులో కొత్తగా చేపడుతున్న వాటర్‌పార్కు తదితర నిర్మాణాలను మరింత ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు.

అడిగేదెవరు.. ఇలానే వదిలేస్తాం



వాకలపూడి పారిశ్రామికవాడలోని పరిశ్రమల నుంచి వస్తున్న రసాయనాలు



ఫిషింగ్ హార్బర్‌పేట వద్ద సముద్రంలో కలుస్తూ...

నిబంధనల ప్రకారం పరిశ్రమల నుంచి వదిలే వ్యర్థ జలాలను శుద్ధి చేసి బయటకు పంపించాలి. అయితే కాకినాడ వాకలపూడి పారిశ్రామికవాడలో కొన్ని పరిశ్రమలు విషతుల్యమైన రసాయనాలను విచ్చలవిడిగా వదిలేస్తున్నాయి.. దీంతో పరిసర ప్రాంతాలు కాలుష్య కోరల్లో చిక్కుకోగా.. అదే రసాయనాలు చివరకు సముద్రంలో కలుస్తున్నాయి.. ఈ కారణంగా సముద్రంలో జీవరాశిపై తీవ్ర ప్రభావం పడుతోంది.. మత్స్య సంపద తగ్గిపోయి మత్స్యకారులకు జీవనోపాధి కరవవుతోంది.. మరోవైపు ప్రజలు సముద్రంలో దొరికే చేపలు తిని రోగాలపాలవుతున్నారు.. కాలుష్య నియంత్రణ అధికారులు చర్యలు తీసుకోవల్సిన అవసరం ఉంది.

- ఈనాడు, కాకినాడ

తెలుగు వికాసానికి అడుగులు!

● చారిత్రక నగరిలో విశ్వవిద్యాలయం ● త్వరలో నిర్ణయం వచ్చే అవకాశం



తెలుగుసాహిత్య పీఠం ప్రధాన ద్వారం

ఈనాడు, రాజమహేంద్రవరం: విద్యారంగం పరంగా రాజమహేంద్రవరం మరో మైలురాయి చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. తెలుగు విశ్వవిద్యాలయం ఏర్పాటుకు కార్యాచరణ సిద్ధమవుతోంది. హైదరాబాద్ కేంద్రంగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉన్న విషయం తెలిసిందే. దీనికి అనుబంధంగా రాజమహేంద్రవరం, శ్రీశైలం, కూచిపూడిలో పీఠాలున్నాయి. విభజన చట్టం మేరకు పదేళ్ల గడువు పూర్తయ్యేలోగా వైకాపా సర్కారు పట్టించుకోలేదు. తెలంగాణ ప్రభుత్వం ఈ ఏడాది ప్రవేశాలకు అనుమతించకపోవడంతో ప్రత్యామ్నాయ చర్యలపై ఉన్నత విద్యాశాఖ దృష్టిసారించింది. రాజమహేంద్రవరం కేంద్రంగా విశ్వవిద్యాలయం ఏర్పాటుచేసి ఇతర పీఠాలను అనుసంధానం చేసే అంశాన్ని యోచిస్తోంది. నెలరోజుల్లో స్పష్టత రానుంది.

220 మంది విద్యార్థులు

రాజమహేంద్రవరం, కూచిపూడి, శ్రీశైలంలోని పీఠాల్లో సుమారు 220 మంది విద్యార్థులున్నారు. కొత్తగా చేరాలనుకున్న వారికి ఒక విద్యా సంవత్సరం వృథా అయ్యే అవకాశం ఉంది.

ఇక్కడే ఎందుకంటే...

రాజమహేంద్రవరం గ్రామీణం బొమ్మూరులోని 40 ఎకరాల్లో 48 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో తెలుగు సాహితీపీఠం, భవనాలు ఉన్నాయి. నిర్వహణకు 72 మంది బోధన, 115 మంది బోధనేతర సిబ్బంది అవసరం. హైదరాబాద్‌లో పనిచేస్తున్నవారిలో 112 మంది బోధనా, బోధనేతర సిబ్బంది రాష్ట్రానికి చెందినవారే కావడంతో వారిని బదిలీ చేస్తే సమస్య పరిష్కారమవుతుందని భావిస్తున్నారు. ఎంపీ పురందేశ్వరి, మంత్రి దుర్గేశ్, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి వాసు, ఇతర ప్రజాప్రతినిధులు ఈ దిశగా కృషిచేయాలన్న ఆకాంక్ష వ్యక్తమవుతోంది .

ఉన్నత విద్యాశాఖ దృష్టికి..

తెలుగు విశ్వవిద్యాలయంలో విద్యార్థుల ప్రవేశాలకు ఇప్పటి వరకు తెలంగాణ ప్రభుత్వం అనుమతివ్వలేదు. రాజమహేంద్రవరంలో వర్సిటీ ఏర్పాటుకు ఉన్న అవకాశాలను ఉన్నత విద్యాశాఖ అధికారులకు విన్నవించాం. ప్రభుత్వం నుంచి సానుకూల నిర్ణయం వస్తుందని భావిస్తున్నాం.

-నిరీక్షణబాబు, ప్రొఫెసర్, ఓఎస్డీ, తెలుగు సాహిత్య పీఠం

ఈ కోర్సులు అందుబాటులోకి..

తెలుగు విశ్వవిద్యాలయంలో తెలుగు భాష, సంస్కృతి, సాహిత్యం, చరిత్ర, భాషా సాహిత్యం, తులనాత్మక సాహిత్యం, జ్యోతిషం, జర్నలిజం, లలిత సంగీతం, కర్ణాటక సంగీతం, కూచిపూడి నృత్యం, శిల్పం, చిత్రలేఖనం తదితర 17 విభాగాల్లో ఎంఏ, ఎంఫిల్, పీహెచ్‌డీ, తదితర డిప్లొమో కోర్సులు ఉన్నాయి. ఇవన్నీ స్థానికంగా రాష్ట్ర విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావొచ్చు. ● చరిత్ర, పురావస్తుశాస్త్రానికి సంబంధించి శ్రీశైలంలోని పీఠంలో ఎంఏ, పీహెచ్‌డీ కోర్సులున్నాయి. ● కూచిపూడి పీఠంలో కూచిపూడి నాట్యంలో ఎంఏ, సర్టిఫికెట్, డిప్లొమో కోర్సులు ఉన్నాయి. ఇవన్నీ యథవిధిగా కొనసాగించవచ్చు.

రైతేరాజు అన్నదాతకు అండగా నిలిచేందుకు విభిన్న కథనాల సమాహారం -6లో

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 124 అర్జీలు

మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండపేట మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 124 అర్జీలు వచ్చాయి. వీటిని కలెక్టరు డాక్టర్ మహేష్‌కుమార్ తీసుకొని తక్షణం పరిష్కరించాలంటూ సంబంధిత అధికారులను ఆదేశించారు. దివ్యాంగుల వద్దకు కలెక్టరు వినతులు తీసుకోవడంతో అర్జీదారులు తమ సమస్యలను తెలియజేశారు. పింఛన్ల పెంపు, పోలీసు అధికారులకు, పీహెచ్‌సీలకు, పలు శాఖలకు అర్జీలు వచ్చినట్లు ఎంపీడీవో సత్యనారాయణమూర్తి తెలిపారు. రామచంద్రపురం ఆర్డీవో కతీబ్‌కౌశర్‌భానో, తహసీల్దారు తేజేశ్వరరావు, మండపేట రూరల్ సీఐ దొరరాజు, ఎస్సై శాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.



తండ్రికి పింఛను పెంచాలని కలెక్టరును కోరుతున్న చిన్నారి

అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం

అమలాపురం పట్టణం: అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని జేసీ టి.నిషాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం అమలాపురం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు స్వీకరించారు. 155 మంది వినతులు అందజేశారు. కార్యక్రమంలో సీపీవో వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలతో రూ. 70 కోట్ల ఆదాయం

ఆలమూరు, కొత్తపేట, రాజోలు: జిల్లా వ్యాప్తంగా మద్యం దుకాణాల ఏర్పాటుకు 3,500 దరఖాస్తులు వస్తాయని, రూ.70 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్‌కేడీవీ ప్రసాద్ తెలిపారు. సోమవారం ఆలమూరు, కొత్తపేట ఎక్సైజ్ కార్యాలయాల్లో దరఖాస్తుల అంశాన్ని పరిశీలించారు. సీఐ ఐ.డి.నాగేశ్వరరావు, కాత్యాయనిలతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ.. మండలం యూనిట్‌గా తీసుకోవడం వల్ల వ్యాపారం బాగా జరుగుతుందని.. నాటుసారా, ఇతర మాదకద్రవ్యాల కట్టడి సాధ్యమవుతుందని భావిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో 430 దరఖాస్తులు వచ్చాయన్నారు. 9వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు గడువు ఉందన్నారు. 11న కలెక్టర్ కార్యాలయం గోదావరి భవన్‌లో డ్రా తీస్తారని తెలిపారు. కొత్తపేట నియోజకవర్గంలో 25 దుకాణాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. రాజోలు ఎక్సైజ్ కార్యాలయంలోనూ సోమవారం విలేకరులతో మాట్లాడారు. సీఐ కె. వీరబాబు, ఎస్సై సీహెచ్ స్వామిరెడ్డి పాల్గొన్నారు.

ఆయిల్ మాఫియా మాయాజాలం

తీర గ్రామాల్లో అక్రమ రవాణా

– న్యూస్‌టుడే, మామిడికుదురు, అంతర్వేది

ట్యాంకర్ల ద్వారా క్రూడ్ ఆయిల్ ఏవేవో బిల్లులతో నేరుగా వచ్చి నిర్దేశించిన చోటుకు చేరుతుంది. అక్కడి నుంచి వాహనాల ద్వారా తీర గ్రామాల్లోకి దఫదఫాలుగా తరలించేస్తుంటారు. ఎవరైనా ఆరాతీస్తే మూతపడిన బయోడీజిల్ బంకుల పేరుతో వే బిల్లులు చూపిస్తుంటారు. మరపడవలు, ఆక్వా చెరువుల సాగులో ఉపయోగించే ఇంజిన్లకు ఈ ఆయిల్‌ను గోప్యంగా విక్రయిస్తుంటారు. మరోవైపు యానాం నుంచి ఈ డీజిల్ అక్రమ రవాణా చాపకింద నీరులా సాగిపోతోంది. ధరల్లో వ్యత్యాసాలున్న కారణంగా దీనిపై ఎక్కువ మంది మొగ్గు చూపుతున్నారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పౌరసరఫరాల శాఖ అధికారులు మామిడికుదురు మండలం పాశర్లపూడిలంకలో ఈ నెల 1న 47 పీపాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన 9,400 లీటర్ల సాల్వెంట్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.5.86 లక్షలు ఉన్నట్లు నిర్ధారించారు. యంత్ర పరికరాలను శుభ్రం చేసుకునేందుకు, రంగుల పరిశ్రమల్లోనూ దీనిని ఉపయోగిస్తారు. ట్యాంకరుకు సంబంధించిన వే బిల్లులో సాల్వెంట్ ఆయిల్‌గా నమోదు చేసినా అందులో ఉన్నది డీజిల్‌ను పోలిన క్రూడ్ ఆయిలేనన్న అనుమానాలున్నాయి. దీనిని ఎక్కడి నుంచి తరలిస్తున్నారన్న విషయంపై అధికారులు ఆరా తీస్తున్నారు.

సఖినేటిపల్లి మండలం అంతర్వేది నుంచి మామిడికుదురు మండలం కరవాక వరకు నాలుగు మండలాల్లో దాదాపు 5 వేల ఎకరాల్లో ఆక్వా సాగు విస్తరించింది. ఈ పరిధిలో 1,200 ఆయిల్ ఇంజిన్లున్నాయి. అంతర్వేది పల్లిపాలెం రేవుకు కాకినాడ, మచిలీపట్నం తదితర ప్రాంతాల నుంచి రోజూ 30 వరకు సోనాబోట్లు వస్తుంటాయి. ఇంజిన్లు, బోట్లకు ఈ క్రూడ్ ఆయిల్‌ను రహస్యంగా విక్రయిస్తున్నారు.

ధర తక్కువ ఉండటంతో..

డీజిల్ ధరతో పోల్చిచూస్తే లీటరుకు రూ.40 వరకు వ్యత్యాసం ఉండటంతో దీనినే ఉపయోగిస్తున్నారు. దీంతో ఈ వ్యాపారం జోరుగా సాగుతోంది.

మూతపడిన బంకుల పేరుతో..

అంతర్వేది ప్రాంతంలో రెండుచోట్ల ఉన్న బయోడీజిల్ బంకులు అనుమతులు లేని కారణంగా కొంతకాలంగా మూతపడి ఉన్నాయి. సాల్వెంటు ఆయిల్‌గా వస్తున్న క్రూడ్ ఆయిల్ ఈ బంకుల పేరుతో వస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వీటి ముసుగులో ఆయిల్ అక్రమ విక్రయాల దందాను గుట్టుచప్పుడు కాకుండా కొనసాగించేస్తున్నారు. పాశర్లపూడి, శివకోటి, తాటిపాక, చాకలిపాలెం తదితర ప్రాంతాల్లో ఆయిల్ ట్యాంకర్లను చోదకులు తమ విశ్రాంతి కోసం నిలుపు చేసినట్లు ఉంచడంతో అక్కడ్నించి కొందరు పీపాల ద్వారా రహస్యంగా తరలిస్తున్నారు.



పాశర్లపూడిలంకలో ఇటీవల అధికారులు స్వాధీనం చేసుకున్న క్రూడ్ ఆయిల్ పీపాలు

కలెక్టర్‌కు నిర్వాహకుల ఫిర్యాదు

యానాం నుంచి డీజిల్‌ను అంబేడ్కర్ కోనసీమ జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని నిర్దేశించిన చోట్లకు జాతీయ రహదారి మీదుగా చిన్న ట్యాంకర్లు, వాహనాలపై అక్రమంగా తరలిస్తున్నారు. ప్రతి రోజూ దాదాపు 40 నుంచి 50 వేల లీటర్ల వరకు తరలిపోతోందంటూ అయిల్ బంకుల నిర్వాహకులు కలెక్టర్‌ను ఇటీవల కలిసి విజ్ఞప్తి చేశారు. స్థానికంగా పోల్చి చూస్తే లీటరుకు రూ.13 తక్కువగా ఉండడంతో ఈ అక్రమ రవాణా గోప్యంగా సాగిపోతోంది.

పూర్తిస్థాయిలో నిఘా ఉంచాం

ఆయిల్ అక్రమ రవాణాపై పూర్తిస్థాయిలో నిఘా పెట్టాం. ఇటీవల పాశర్లపూడిలంకలో 47 పీపాలను అధికారులు పట్టుకున్నారు. దీనిపై కేసు నమోదైంది. క్రూడ్ ఆయిల్‌ను ఎక్కడ్నించి తెచ్చి ఎక్కడెక్కడికి సరఫరా చేస్తున్నారన్న అంశంపై కూడా పరిశీలన చేస్తున్నాం.

- డి.శ్రీనివాస్, ఎంఎస్‌వో, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాలు

దాహం తీరనుంది

నగర పంచాయతీల్లో ఏఐఐబీ నిధుల వినియోగానికి గడువు పెంపు

న్యూస్‌టుడే, ముమ్మిడివరం

వైకాపా ప్రభుత్వం నిర్వాకం కారణంగా నిధులున్నా.. పనులు జరగని పరిస్థితి నెలకొంది. అలాంటి వాటిలో ఏఐఐబీ (ఆసియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు) నిధులు సైతం చేరిపోయాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ముమ్మిడివరం, గొల్లప్రోలు, ఏలేశ్వరంను 2011లో నగర పంచాయతీలుగా ఉన్నతీకరించారు. 2018లో అప్పటి తెదేపా ప్రభుత్వం ఏఐఐబీ ద్వారా నిధులు తీసుకువస్తే.. తర్వాత వచ్చిన వైకాపా ఆ ప్రాజెక్టులను గాలికొదిలేసింది. ఈ ఏడాది జులైతో ప్రాజెక్టు గడువు ముగిసింది. కూటమి ప్రభుత్వం కృషితో కేంద్రం మూడేళ్ల గడువు పొడిగించింది.

ముమ్మిడివరంలో రూ.115.68 కోట్లతో

ముమ్మిడివరానికి తాగునీరు అందించాలనే లక్ష్యంతో 2018లో అప్పటి ప్రభుత్వం ఏఐఐబీ నిధులు రూ.115.68 కోట్లు మంజూరు చేసింది. ధవళేశ్వరం గోదావరి నుంచి పైపులైన్‌ల ద్వారా నీటిని సరఫరాకు రూపకల్పన చేశారు. మట్టాడిపాలెం వద్ద డబ్ల్యూటీపీ (వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్) నిర్మాణానికి 2 ఎకరాలు కేటాయించారు. ప్లాంటులో శుద్ధి చేసిన నీటి సరఫరాకు బొండాయకోడుతూము, అంబేడ్కర్‌నగర్, సోమిదేవరపాలెం, క్రాపచింతలపూడి ప్రాంతాల్లో 5 లక్షల లీటర్లు, మార్కెట్ ప్రాంతంలో 7 లక్షల లీటర్ల సామర్థ్యం ఉన్న ట్యాంకులు నిర్మించేలా రూపకల్పన చేశారు.

రెండు ప్యాకేజీలుగా..

పనులను రెండు ప్యాకేజీలుగా విభజించి టెండర్లు ఖరారు చేశారు. మొదటి ప్యాకేజీలో పైపులైన్ పనులను 2022లో ప్రారంభించగా.. కేవలం 4 కిలోమీటర్లు మాత్రమే వేశారు. రెండో ప్యాకేజీలో రూ.91 కోట్లుకాగా.. బొండాయకోడుతూము, అంబేడ్కర్ నగర్‌లలో 5 లక్షల లీటర్ల తాగునీటి ట్యాంకులు నిర్మాణాలు ప్రారంభించి పునాది స్థాయి వరకు చేసి పనులు నిలిపివేశారు.



బొండాయకోడుతూము వద్ద నిలిచిన ట్యాంకు నిర్మాణం

త్వరలో పనులు ప్రారంభం

ఏఐఐబీ నిధులు గడువు ఈ ఏడాది జులైతో ముగిసిపోయింది. ప్రభుత్వం దీనిపై ప్రత్యేక దృష్టి సారించి ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి చేయాలనే లక్ష్యంతో ముందుకు వెళ్లడంతో మరో మూడేళ్ల పాటు గడువు పెంచారు. త్వరలో పనులు ప్రారంభిస్తాం.

-హుస్సేన్, ఈఈ, ప్రజారోగ్య శాఖ

నగర పంచాయతీ	జనాభా	పథకం పేరు	నిధులు	బిల్లు బకాయిలు
ముమ్మిడివరం	25,000	ఏఐఐబీ	రూ.115.68 కోట్లు	రూ.4.36 కోట్లు

ధాన్యం సేకరణకు సన్నద్ధం

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: ధాన్యం సేకరణకు అధికారులు సన్నద్ధం కావాలని జేసీ నిషాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లా నుంచి 4.05 మెట్రిక్ టన్నుల ధాన్యం విక్రయానికి వచ్చే అవకాశం ఉందని, రైతుల అవసరాల మేరకు గోనె సంచులు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో, రవాణా ఛార్జీలు వారం రోజుల్లో రైతుల ఖాతాకు జమ అవుతాయని తెలిపారు. డీఆర్‌వో ఎం.వెంకటేశ్వర్లు, డీఎస్‌వో ఉదయభాస్కర్, డీఏవో బోసుబాబు, డీసీవో మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కీలక కట్టడం.. పర్యవేక్షణ కరవు

డొక్కాసీతమ్మ అక్విడక్టుపై హ్యాండ్‌రెయిల్స్ అపహరణ

– న్యూస్‌టుడే, పి.గన్నవరం

పి.గన్నవరం డొక్కాసీతమ్మ అక్విడక్టుపై అమర్చిన హ్యాండ్‌రెయిల్స్‌లో కొన్నింటిని ఇటీవల గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. 440 మీటర్ల మేర ఏడాది క్రితం రూ.40 లక్షలతో హ్యాండ్‌రెయిల్స్ ఏర్పాటు చేశారు. గోదావరి నదికి ఉద్ధృత వరదల సమయంలో అక్విడక్టుపై చెత్త అడ్డుపడకుండా వీటిని కిందకు దించేవిధంగా రూపకల్పన చేసి అమర్చారు. 282 హ్యాండ్ రెయిల్స్ (స్టీల్‌తో తయారు చేసిన ఫ్రేమ్‌లు) ఏర్పాటు చేశారు. వీటిలో 17 ఫ్రేమ్‌లు గుర్తుతెలియని వ్యక్తులు విరగ్గొట్టి అపహరించుకుపోయారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశామని జలవనరుల శాఖ డీఈఈ నాగేంద్రకుమార్ తెలిపారు. గత నెల 24న కేసు నమోదు చేశామని ఎస్సై బి.శివకృష్ణ తెలిపారు. పాత ఇనుము కొనే దుకాణాల వద్ద విచారణ చేపట్టామన్నారు.

ప్రధానంగా అక్విడక్టు రోడ్డు వంతెనపై ఉన్న విద్యుత్తు దీపాలు కొన్ని సంవత్సరాలుగా వెలగడం లేదు. రాజోలు దీవిలో సుమారు 50 వేల ఎకరాలకు దీని ద్వారా సాగునీరు అందుతుంది. లక్షలాది మంది జనాభాకు తాగునీటి అవసరాలను తీర్చుతుంది. అన్నింటికి మంచి రాజోలు దీవి నుంచి పి.గన్నవరం వైపు రోడ్డు రవాణాకు కీలకంగా పనిచేస్తుంది. ఇంతటి ప్రాధాన్యత గల ఈ అక్విడక్టుపై ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

సమస్యలకు నిలయంగా...

కొంతమంది ఆకతాయిలు పాత అక్విడక్టుపై రాత్రి సమయాల్లో కూర్చొని మద్యం సేవిస్తున్నారు. సీసాలు పగులకొట్టి పడేస్తున్నారు. ఇలాంటివన్నీ అరికట్టాలంటే డొక్కా సీతమ్మ అక్విడక్టుతో పాటు కాటన్ నిర్మించిన పాత అక్విడక్టుపై నిరంతర పరిశీలనకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, తరచూ సిబ్బంది పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానికులు కోరుతున్నారు.



హ్యాండ్‌రెయిల్స్ చోరీ అయిన ప్రదేశం

రక్షణ చర్యలు చేపడతాం

డొక్కా సీతమ్మ, కాటన్ అక్విడక్టుల వద్ద రక్షణ చర్యలు చేపట్టేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రధానంగా వీటిపై సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. వీటి ఏర్పాటుకు నిధులు కావాలి. ఈ మేరకు ప్రతిపాదనలు పంపించాం.

- నాగేంద్రకుమార్, డీఈఈ, జలవనరులశాఖ, పి.గన్నవరం సబ్‌డివిజన్

అసైన్డ్ భూములపై నివేదిక ఇవ్వాలి

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: అసైన్డ్ భూములకు ఉచిత హక్కులు కల్పించడానికి తనిఖీలు నిర్వహించి, రిజిస్ట్రేషన్ నివేదికలను సమర్పించాలని జేసీ టి.నిషాంతి తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. జేసీ మాట్లాడుతూ అసైన్డ్ భూములు, ఇతరత్రా భూముల రిజిస్ట్రేషన్ వివరాలు రెవెన్యూ సిబ్బంది త్వరితగతిన జిల్లా కార్యాలయానికి తెలపాలన్నారు. కలెక్టరేట్ భూ పరిపాలన విభాగం డిప్యూటీ తహసీల్దారు చిన్నబాబు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. సోమవారం అమరావతి నుంచి రాష్ట్ర భూ పరిపాలన ముఖ్య కమిషనర్ జి.జయలక్ష్మి దూరదృశ్య సమావేశం నిర్వహించి అసైన్డ్, డి పట్టా భూములపై సమీక్ష నిర్వహించారు.


అంబాజీపేటలో వాసవీకన్యకాపరమేశ్వరీదేవి


ద్రాక్షారామలో మహాచండికాదేవిగా


గోదశివారిపాలెంలో గాజులతో


రామచంద్రపురంలో వారాహి మాతగా

జగన్మాతా.. రక్షమాం

శరన్నవరాత్రి ఉత్సవాలు జిల్లాలో ఘనంగా జరుగుతున్నాయి. అమ్మవారిని రోజుకో అలంకరణ చేస్తున్నారు. సోమవారం లలితాత్రిపురసుందరీదేవిగా, వారాహి మాతగా, శాకంబరిగా, మహాచండీదేవిగా ఇలా పలు రూపాల్లో అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. మహిళలు సామూహికంగా ప్రతిరోజూ లలితాసహస్రనామాలు పారాయణం, కుంకుమ పూజలు చేస్తున్నారు.

లైక్.. షేర్ చేస్తే డబ్బులురావు

– న్యూస్‌టుడే, దానవాయిపేట (రాజమహేంద్రవరం)

డబ్బులు ఎవరైనా ఊరికే ఎందుకిస్తారు? లైక్ చేయండి.. షేర్ చేయండి.. మీ బ్యాంకు ఖాతాలో నగదు వేస్తామని రూ.వెయ్యి, రెండు వేలు ఎర వేసి ఆన్‌లైన్ మోసగాళ్లు రూ.లక్షలు దోచుకుంటున్నారు. ఇలాంటి మోసాలపై పోలీసులు, సైబర్ నిపుణులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా ఇటువంటి సంఘటనలు బయటపడుతూనే ఉన్నాయి. ఆన్‌లైన్ మోసాల బారిన పడుతున్నవారిలో అత్యధిక శాతం విద్యావంతులే కావడం పోలీసులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఏమీ చదువుకోకపోయినా గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి ఓటీపీ చెప్పమంటే అవతల వ్యక్తికి మూడు చెరువుల నీళ్లు తాగిస్తున్నవారు ఉన్నారు. అలాంటిది విశ్రాంత ఉపాధ్యాయుడు, డాక్టర్, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, బ్యాంకు విశ్రాంత ఉద్యోగులు సైబర్ మోసాల బాధితుల్లో ఉండడం గమనార్హం.

యాప్ పేరిట మోసం

ఇటీవల జిల్లాలోని పలువురు ఓ యాప్‌లో రూ.వేలల్లో నగదు జమచేసి టాస్క్ తీసుకున్నారు. యాప్‌లో వచ్చిన వీడియోలను లైక్, షేర్ చేస్తే రూ.లక్షల్లో నగదు వస్తుందని నమ్మి 15 మందికి పైగా జిల్లావాసులు మోసపోయారు. వారిలో ప్రభుత్వ ఉద్యోగులు, విద్యావంతులు, పోలీసు సిబ్బంది కుటుంబికులు ఉన్నారు. జిల్లా ఎస్పీని కలిసి జరిగిన మోసాన్ని వీరు వివరించారు. దీంతో ఆయా స్టేషన్ల పరిధిలో కేసులు నమోదు చేయాలని ఎస్పీ ఆదేశించారు.

ఏం చేస్తారంటే..



ఐఎఎస్ అనే యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో వీడియోలు వస్తుంటాయి. మన పూర్తి వివరాలు నమోదు చేసి ఉచితంగానే లాగిన్ అవ్వవచ్చు. అనంతరం అక్కడ ఉన్న వీడియోలను లైక్, షేర్, సబ్‌స్క్రైబ్ చేసిన అనంతరం స్క్రీన్ షాట్ తీసి అప్‌లోడ్ చేస్తే రోజుకు రూ.75 చొప్పున యాప్‌లోని మన వ్యాలెట్‌లో వేస్తామని నేరగాళ్లు ఆశ చూపుతున్నారు. అలా జిల్లాలో పలువురు ముందుగా నాలుగు రోజులు ఈ టాస్క్ చేయగా అందరికీ రూ.300 వ్యాలెట్‌లోకి వచ్చింది. అనంతరం ఆ మొత్తం బ్యాంకు ఖాతాలో జమ అయింది. అనంతరం ఏడాది కాలపరిమితితో ఉన్న రూ.2,100 టాస్క్ తీసుకుంటే రోజుకు రూ.75 నగదు వస్తుందని, రూ.5,500 టాస్క్‌తో రోజుకు రూ.200, రూ.18 వేలు టాస్క్‌తో రూ.600 చెల్లిస్తామని యాప్ నిర్వాహకులు నమ్మబలికారు. నగదు వస్తుందనే ఆశతో 14 మంది రూ.18 వేలు టాస్క్‌కు నగదు చెల్లించారు. రోజువారీ వస్తున్న నగదు యాప్ వ్యాలెట్‌లో చేరినట్లు చూపేది. దానిని బ్యాంకు ఖాతాకు మార్చుకునే వీలు మాత్రం ఉండేది కాదు. నిలదీస్తే సాంకేతిక లోపం కారణంగా ఇలా జరిగిందని, సరిచేస్తామని సైబర్ నేరగాళ్లు మాయమాటలు చెప్పేవారు. రోజులు గడుస్తున్నా ఫలితం లేకపోవడంతో మోసపోయామని గ్రహించి బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఫిర్యాదు చేస్తే..

నష్టపోయిన నగదు రూ.15 వేలు పైన ఉంటే ఆన్‌లైన్ మోసం జరిగిన 48 గంటల్లోపు టోల్‌ఫ్రీ నంబరు 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలి. ఐటీ కోర్ పోలీసు బృందం స్పందించి బ్యాంకు ఖాతాను స్తంభింపజేస్తారు. నగదు వెనక్కి రప్పిస్తారు. నష్టపోయిన నగదు రూ.15 వేలు లోపే ఉంటే జాతీయ సైబర్ నేరాల పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలి. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేసి వివరాలు ఐటీ కోర్ విభాగానికి పంపిస్తారు.

రైతేరాజు

నాటుకోళ్ల పెంపకంతో భలే ఆదాయం

స్ఫూర్తి

పి.గన్నవరం, న్యూస్‌టుడే: పది ఎకరాలు వరి సాగు చేశారు.. ప్రకృతి సహకరించలేదు.. ఏటా ఏదో విధంగా నష్టాలే.. దీని నుంచి ఎలా బయటపడాలా అని రైతన్న నాటుకోళ్ల పెంపకం గురించి ఆలోచించారు.. ఆలోచన ఆచరణలో పెట్టి ఆదాయం గడిస్తున్నారు మండలంలోని జి.పెదపూడికి చెందిన ఇందుకూరి వీరభద్రరాజు. ఆయనకు నాటుకోళ్లలో నాణ్యమైన జాతిపట్ల అవగాహన ఉంది. నాణ్యమైన గుడ్లు సేకరించి పిల్లలు చేయించి వాటిని పెంచుతూ పెట్టలు, పుంజులు విక్రయించడం మొదలు పెట్టారు. మొదట్లో 50 పెట్టలు, ఆరు పుంజులతో మొదలు పెట్టిన ఆయన ఏటా వీటి సంతతిని పెంచుతూ గుడ్డు మొదలుకుని కోడి వరకు విక్రయిస్తున్నారు. కోడిపెట్ట రూ.1500లు వరకు విక్రయిస్తారు ప్రధానంగా కోడిపుంజులకు మంచి డిమాండు ఉంటుంది. పుంజుల పెంపకంపై మరింత శ్రద్ధ పెడుతున్నారు. మేత మొదలుకుని మందుల వరకు అన్ని విషయాల్లోనూ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. నాణ్యమైన కోడిపుంజు పూర్తిస్థాయిలో ఎదిగిన తరువాత రూ.25వేల నుంచి రూ.30వేల వరకు ధర పలుకుతుంది. ఏడాదికి 50 కోడిపుంజులు విక్రయిస్తే రూ.15లక్షలు వరకు వస్తుంది. దీంట్లో మేత ఇతర నిర్వహణ ఖర్చులు, కూలి ఖర్చులు పోను రూ.8 లక్షలు వరకు ఆదాయం వస్తుంది. ఇక పెట్టలు, పిల్లలు విక్రయించడం ద్వారా మరో రూ.3 లక్షలు ఆదాయం పొందుతున్నారు. కోళ్లకు మునగ, బొప్పాయి, ఆకు కూరలు, కూరగాయలు మేతగా వేస్తున్నారు. మునగ, బొప్పాయి ఆకులు మేతగా పెట్టడం ద్వారా మేత ఖర్చు తగ్గటమే కాకుండా కోళ్లకు రోగ నిరోధకశక్తి పెరుగుతుందని రైతు వీరభద్రరాజు తెలిపారు.


నాటుకోళ్లకు మేతవేస్తున్న ఇందుకూరి వీరభద్రరాజు

యాజమాన్య పద్ధతులతో ఆకుకూరల సాగు

న్యూస్‌టుడే, ఆత్రేయపురం

వేగంగా పెరిగి, అనతి కాలంలో చేతికందే పంటల్లో తోటకూర, పాలకూర ముఖ్యమైనవి. వీటి సాగుతో మంచి లాభాలు పొందవచ్చని **కొత్తపేట డివిజన్ ఉద్యాన శాఖాధికారి డాక్టర్ కోటేశ్వరరావు** సూచించారు. తోటకూర సాగుకు ఆన్.ఎన్.ఎ-1, కో-1, 2, పూసకీర్తి, కిరణ్ వంటి రకాలు అనుకూలం. పాలకూర సాగుకు పూస జ్యోతి, పూసాహరిత్ వంటి రకాలు అనువుగా ఉంటాయి. విత్తనం వేసే ముందు పశువుల ఎరువుతోపాటు ఎకరాకు 20 కిలోల భాస్వరం, 20 కిలోల నత్రజని, 20 కిలోల పొటాష్‌లను ఆఖరి దుక్కిలో వేసి కలియదున్నాలి. తోటకూర, పాలకూరకు ఒక్కోసారి పాముపొడ, ఆకుతినే పురుగులు వ్యాపించే అవకాశం ఉంటుంది. అలాంటప్పుడు పదిరోజుల మొక్కలపై లీటరు నీటికి 5 మి.లీ వేపనూనె, గ్రాము సబ్బుపొడి కలిపి పైరంతా తడిచేలా పిచికారీ చేయాలి. తెల్లమచ్చల చిత్తపురుగుల బెడద ఉంటే ఆకు కోత అనంతరం లీటరు నీటికి 1 మి.లీ డైక్లోరోవాస్ కలిపి చల్లాలి. తెల్ల తుప్పు తెగులు ఆశిస్తే ఆరంభ దశలో తెగులు సోకిన మొక్కలను పీకివేయాలి. పక్షికన్ను తెగులు ఆశిస్తే లీటరు నీటికి 2.5 గ్రాములు మ్యాంకోజెబ్ కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేసి నివారించవచ్చు.

మీ కోసం


ఆత్రేయపురంలో సాగవుతున్న ఆకుకూరలు

ఆయిల్‌పామ్‌లో కాండం తడి తెగులు

తెలుసుకుందాం..

బిక్కవోలు: ఆయిల్‌పామ్ మొక్కలను ఆశించే తెగుళ్లలో కాండం తడి తెగులు ఒకటి. దీని లక్షణాలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి డా. వైఎస్ఆర్ విశ్వవిద్యాలయం ప్రధాన శాస్త్రవేత్త (ఉద్యాన) డా.జి.రామానందం పలు సూచనలు చేశారు.

తెగులు లక్షణాలు: తెగులు సోకిన చెట్టు మధ్యవరుసలో ఆకులు గోధుమవర్ణంలోకి మారతాయి. ముదురు ఆకులు చనిపోయిన తరువాత ఆ తెగులు లేత ఆకులకు సోకుతుంది. కాండంపై గడ్డపారతో గాయం చేస్తే దాని నుంచి గోధుమ వర్ణంలో భరించలేని దుర్వాసనతో ద్రవం వస్తుంది. ఈ తెగులు తీవ్రంగా ఉన్నపుడు చెట్టు కాండం బెరడు కొద్దిగా మాత్రమే గట్టిగా ఉండి లోపలి కణజాలం కుళ్లిపోతుంది.

నివారణ: తెగులు సోకిన చెట్లను తొలగించి కాల్చివేయాలి. ఆరంభ దశలో ఉంటే కాండానికి శస్త్ర చికిత్స చేసి చెట్టు రక్షించవచ్చు. కాండంపై గాట్లు పెట్టి కుళ్లిన కణజాలాన్ని దాని ఆనుకుని ఉన్న కణజాలాన్ని తొలగించాలి. దానిపై 1 శాతం కార్బండిజమ్, మోనోక్రోటోపాస్ మిశ్రమాన్ని కలిపి పూసి, ఆపై కోల్‌తారును పూయాలి.


తెగులు సోకిన మొక్క

కొబ్బరి తోటల్లో ఇలా చేద్దాం

ప్రశ్న సమాధానం

ప్రశ్న: కొబ్బరితోట వయస్సు 20 సంవత్సరాలు, కొబ్బరికాయల పరిమాణం తగ్గిపోతుంది. దిగుబడి కూడా ఎక్కువ రావడంలేదు. ఏం చేయాలి.
- జి.శ్రీనివాసరావు, అమలాపురం

సమాధానం: వాతావరణ పరిస్థితులను బట్టి చీడపీడలు పెరిగి కాయల ఎదుగుదలపై ప్రభావంపడుతోంది. గతేడాది వేసిన ఎరువులను బట్టి కాంప్లెక్స్ ఎరువులు వాడితే వాటి బదులు సూటి ఎరువులైన యూరియా, సింగిల్ సూపర్‌ఫాస్ఫేట్, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ రూపంలో తోట్లో వేయాలి.
- కిరీటి, ఉద్యానపరిశోధన కేంద్రం శాస్త్రవేత్త


శాస్త్రవేత్త కిరీటి

ప్రశ్న: కొబ్బరితోటల్లో మొవ్వులు సుడులు తిరిగినట్లు వస్తున్నాయి. నివారణ చర్యలు చెప్పండి.
- ఆర్.వెంకటేశ్వరరావు, అంబాజీపేట

సమాధానం: కొబ్బరితోటల్లో మొవ్వ ఆకులు ప్రతి నెలా ఒకటి రావడం గమనించవచ్చు. ఆ క్రమంలో కొమ్ముపురుగు ఆశించడం వల్ల ఈ మొవ్వు అనేది వంకరగా వస్తుంది. అలా కాకుండా బోరాన్ లోపంతో కూడా ఇలా మొవ్వులు సుడులు రావడానికి ఆస్కారం ఉంది. వీటిని పరిశీలించుకుని బోరాన్ లోపానికి బోరాక్స్ మందులు ఒక మొక్కకి 100 గ్రాములు వేస్తే క్రమంగా ఆరోగ్యవంతమైన మొక్క పెరగడానికి ఆస్కారం ఉంటుంది.
- కిరీటి, శాస్త్రవేత్త

- న్యూస్‌టుడే, అంబాజీపేట

సీఎంఆర్ విధానంలో ధాన్యం కొనుగోలుపై హర్షం


మంత్రి మనోహర్‌తో జిల్లా రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులు

పామర్రు, న్యూస్‌టుడే: ఖరీఫ్ సీజన్ నుంచి సీఎంఆర్ విధానంలో ధాన్యం కొనుగోలుకు జిల్లాను యూనిట్‌గా తీసుకుంటూ కూటమి ప్రభుత్వం నిర్ణయించడంపై జిల్లా రైస్ మిల్లర్ల సంక్షేమ సంఘం హర్షం వెలిబుచ్చింది. సోమవారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను సంఘ నాయకులు కలిసి ధన్యవాదాలు తెలిపారు. రైస్ మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ఛైర్మన్ బాధ్యతలు స్వీకరించిన తోట సుధీర్‌ను కూడా కలిశారు. సంఘం అధ్యక్షుడు మద్దు వీవీఎస్ చౌదరి, సంయుక్త కార్యదర్శి ఇజ్జిన కనకదుర్గారావు, తాలూకా అధ్యక్షుడు చందిబాబు, గుత్తుల చరణ్, వి.శ్రీమన్నారాయణ, భద్రరావు తదితరులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాల పర్యవేక్షణకు అన్నవరం ఈవో

అన్నవరం, న్యూస్‌టుడే: విజయవాడ ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఇబ్బందులు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిగా దేవాదాయశాఖ అదనపు కమిషనర్, అన్నవరం దేవస్థానం ఈవో కె.రామచంద్రమోహన్‌ను ప్రభుత్వం నియమించింది. దసరా ముందు నాలుగు రోజుల ఏర్పాట్లు పర్యవేక్షణకు రామచంద్రమోహన్‌ను నియమిస్తూ దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆదేశించారు. దీంతో ఆయన హుటాహుటిన అన్నవరం నుంచి బయల్దేరి విజయవాడ వెళ్లారు.

గుంతల రోడ్లతో పాట్లు



సఖినేటిపల్లి మండలం కేశవదాసుపాలెం-అంతర్వేది దిండుపంత, శృంగవరప్పాడు-అంతర్వేది ప్రధాన రహదారులు గుంతలమయంగా మారడంతో ప్రయాణికుల అవస్థలు తప్పడంలేదు. 2016లో నూతనంగా నిర్మించిన దిండుపంత రోడ్డు 2019లో పూర్తిగా ఛిద్రమైంది. అప్పటినుంచి తూతూమంత్రంగా మరమ్మతులు చేయడమే తప్ప శాశ్వత పనులు చేపట్టలేదు. ఈ రహదారులపై నిత్యం వేలాది మంది భక్తులు, నాలుగు గ్రామాల ప్రజలు, ఓఎన్‌జీసీ వాహనాలు తిరుగుతుంటాయి. అనేక మంది గుంతల్లో పడి ప్రమాదాలకు గురయ్యారు. అధికారులు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకునే నాథుడు కరవయ్యాడని స్థానికులు వాపోతున్నారు. దీనిపై ఆర్‌అండ్‌బీ జేఈని వివరణ కోరగా ప్రతిపాదనలు చేయడం జరిగిందని, త్వరలోనే రోడ్లు వేస్తామని తెలిపారు.
– న్యూస్‌టుడే, సఖినేటిపల్లి


రావులపాలెం నుంచి బయలుదేరిన భక్తులు

మైసూరు యాత్రకు ఆర్టీసీ బస్సులు

రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మైసూరు యాత్రకు ఆర్టీసీ ఏర్పాట్లు చేసింది. సోమవారం రావులపాలెం బస్టాండ్ నుంచి భక్తులు రెండు బస్సుల్లో బయలుదేరి వెళ్లారు. 18 క్షేత్రాల దర్శనం అనంతరం 15వ తేదీన తిరిగి బస్సులు రావులపాలెం చేరుకుంటాయని డిపో మేనేజరు కుమార్ తెలిపారు.

అక్విడక్టు వద్ద చెట్ల తొలగింపు

ఈనాడు కథనానికి స్పందన

పి.గన్నవరం, న్యూస్‌టుడే: పి.గన్నవరం వద్ద వైనతేయ గోదావరి నదీపాయపై ఉన్న డొక్కాసీతమ్మ అక్విడక్టు వద్ద పెరిగిపోయిన చెట్లను తొలగించే పనులు సోమవారం మొదలుపెట్టారు. 'అక్విడక్ట నిర్వహణపై నిర్లక్ష్యం' శీర్షికన 'ఈనాడు'లో ఈ నెల 2న వెలువడిన కథనంపై జలవనరులశాఖ డీఈఈ నాగేంద్రకుమార్ స్పందించారు. జలవనరులశాఖ సిబ్బందితో పాటు పొక్లెయిన్‌తో ఇక్కడి చెట్ల తొలగింపు పనులు చేపట్టారు. కాటన్ నిర్మించిన అక్విడక్టుపై ఉన్న చెట్లను సైతం తొలగిస్తామన్నారు. ఆయా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎవరైనా వ్యర్థాలు వేస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

అంతర్జాతీయ పోటీల్లో వెంకటహర్షకు బంగారు పతకం

మసీదుసెంటర్: ఉగాండాలో ఈనెల 3 నుంచి 6 వరకు నిర్వహించిన ఉగాండా అంతర్జాతీయ సిరీస్-2024 పోటీల్లో కాకినాడ జిల్లాకు చెందిన వెంకట హర్ష రాయుడు ప్రతిభ చాటాడు. పురుషుల డబుల్స్ విభాగంలో పోటీపడిన హర్ష-రిత్ జట్టు బంగారు పతకం సాధించింది. హైదరాబాద్ పుల్లెల గోపీచంద్ అకాడమీలో దాదాపు ఆరుఏళ్లుగా బ్యాడ్మింటన్‌లో శిక్షణ పొందారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూపాయల్లో)
కొత్తకొబ్బరి	11,500
పాతకాయ గండేరా	17,500
గటగట	15,500
కొత్తకాయ గండేరా	16,500
గటగట	14,500
నీళ్ల కాయ (వెయ్యికాయలు) పాత	14,000-15,000
కొత్త	13,500-14,000
కొబ్బరి నూనె 15 కిలోలు	3,750
	260

వెన్‌కాబ్ చికెన్ ధర (కిలో రూపాయల్లో)

ఫారంకోడి	120-00
బ్రాయిలర్ లైవ్	142-00
స్కిన్	206-00
స్కిన్‌లెస్	234-00

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర: గుడ్డు ధర రూ. 5-25 పై

పులసలు కాదు.. విలసలు



అంతర్వేది, న్యూస్‌టుడే: అంతర్వేది మినీ ఫిషింగ్ హార్బర్‌కు సోమవారం విలస చేపలు వచ్చాయి. గోదావరికి ఎర్రనీరు వచ్చినప్పుడు సముద్రంలో నుంచి విలస చేపలు ఎదురీదుతూ వచ్చి పులసగా మారుతుంది. ఈసారి మూడు సార్లు వరద (ఎర్రనీరు) వచ్చినప్పటికీ మత్స్యకారులకు పులస చేపలు ఎక్కువగా దొరకలేదు. ప్రస్తుతం ఎర్రనీరు పోయి ఉప్పునీరు వస్తున్న తరుణంలో విలస చేపలు వలలకు చిక్కుతున్నాయి. వరద సమయంలో ఒక్కో పులస రూ.5 వేల నుంచి రూ.25 వేల వరకు ధర పలుకుతుంది. ప్రస్తుతం దొరికిన విలస రూ.800లోపే ధర పలుకుతోందని మత్స్యకారులు చెబుతున్నారు.

భవాని భక్తులను ఢీకొన్న ఆటో

భీమడోలు, ఉంగుటూరు: ఏలూరు జిల్లా పూళ్ల- కైకరం గ్రామాల మధ్య సోమవారం రాత్రి రోడ్డు ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం మాచవరానికి చెందిన భవాని భక్తులు పాదయాత్రగా విజయవాడ వెళ్తున్నారు. కైకరం దాటాక వెనుక నుంచి ఆటో ఢీకొంది. మల్లిడి ఆదిరెడ్డి(24) అక్కడికక్కడే మృతి చెందారు. మరో యువకుడు వెలగల శివ గాయపడ్డారు. క్షతగాత్రుడ్ని భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

విధుల్లోనే కుప్పకూలి మృతి

దేవరపల్లి: ఉదయం ఆరు గంటలకు విధులకు వెళ్లిన వ్యక్తి ఎనిమిది గంటల ప్రాంతంలో ఒక్కసారిగా కుప్పకూలి ప్రాణాలు వదిలారు. యర్నగూడెంలో సోమవారం ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. దేవరపల్లి మండలం త్యాజంపూడికి చెందిన నాగిరెడ్డి గంగయ్య ప్రభువు(48) ఆరేళ్లుగా 3 ఎఫ్ ఆయిల్‌పామ్ కర్మాగారంలో ఎఫ్ఎఫ్‌బీ (ఫ్రెష్ ఫ్రూట్ బంచ్)లో సూపర్ వైజర్‌గా పని చేస్తున్నారు. ఇతనికి వివాహమైంది. ఇద్దరు పిల్లలున్నారు. రోజూ మాదిరిగా సోమవారం ఉదయం 6 గంటలకు కర్మాగారంలో విధులకు హాజరయ్యారు. 8 గంటల సమయంలో ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయారన్నారు. చికిత్స నిమిత్తం దేవరపల్లి పీహెచ్‌సీకి తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గోపాలపురం సీహెచ్‌సీకి తరలించినట్లు తెలిపారు. మృతుడు భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుబ్రహ్మణ్యం తెలిపారు.

సినీ ఫక్కీలో చోరీ

మహిళ మెడలోని 40 గ్రాముల తాళిబొట్టు లాక్కెళ్లిన చోరులు

తుని, తుని పట్టణం, న్యూస్‌టుడే: దర్జాగా రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌పై పురవీధుల్లో సోమవారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో చక్కర్లు కొట్టారు. ఓ మహిళ మెడలో బంగారు వస్తువులు ఉండటాన్ని గమనించారు. పక్కాగా రెక్కీ నిర్వహించారు. పెద్దగా రద్దీలేని వీధిలోకి మహిళ రాగానే ఠక్కున బైక్ దిగి మెడలోని సుమారు రూ.2.50 లక్షలు విలువైన 40 గ్రాముల నల్లపూసల దండ, పుస్తెలతాడు లాక్కొని క్షణాల్లో పరారయ్యారు. పట్టణ సీఐ ఎం.గీతారామకృష్ణ తెలిపిన వివరాలివీ.. నంబరు ప్లేట్ లేని ద్విచక్ర వాహనం (రాయల్ ఎన్‌ఫీల్డ్, హిమాలయన్ మోడల్ బైక్)పై ఇద్దరు దుండగులు ఓ మహిళను అనుసరించారు. లోవకొత్తూరు గ్రామానికి చెందిన కర్రి లక్ష్మీ సరిగ్గా నారాయణరాజు గారి వీధిలో ఒంటరిగా నడుచుకుంటూ వెళుతుండగా మెడలో నుంచి బంగారు పుస్తెల తాడు, నల్లపూసల దండను లాక్కొని పారిపోయారన్నారు. ఒక్కసారిగా దాడి జరగడంతో కంగుతున్న ఆమె, దుండగులను పట్టుకునేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దీనిపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు. మహిళలు నిర్మానుష్య ప్రదేశాలు, రోడ్లపై ఒంటరిగా వెళ్లవద్దని, మెడలో వేసుకున్న బంగారు ఆభరణాలు కనిపించకుండా చీర కొంగు, చున్నీ కప్పుకొని ఉండాలని సూచించారు. దుండగుల్లో ఒకరు వీపు వెనుక బ్యాగు తగిలించుకుని ఉన్నాడని, దీనిపై అన్ని కోణాల్లోను ముమ్మర దర్యాప్తు చేపట్టామన్నారు. ఏవిధమైన సమాచారం ఉన్నా తక్షణం పోలీసులకు తెలపాలన్నారు.


రోడ్డుపై నడుచుకుని వెళుతున్న మహిళ.. ఎదురుగా నిందితులు


మెడలో నుంచి తాళిబొట్టు లాగేస్తున్న దుండగుడు

రాజోలు

• రాజోలు • కొత్తపేట • పి.గన్నవరం



పౌరసరఫరాల డైరెక్టర్‌గా బాధ్యతల స్వీకరణ

పి.గన్నవరం, న్యూస్‌టుడే: పి.గన్నవరం నియోజకవర్గ తెదేపా కోకన్వీనర్, తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి మోకా ఆనందసాగర్ సోమవారం పౌరసరఫరాల కార్పొరేషన్ డైరెక్టర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలోని పౌరసరఫరాల కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఈ మేరకు బాధ్యతలు స్వీకరించినట్లు ఆయన తెలిపారు. ఈయన్ను పలువురు అభినందించారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



అంతర్వేది, న్యూస్‌టుడే: అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామి ఆలయ ఆవరణలో కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. హైదరాబాద్ చింతల్‌కు చెందిన శ్రీసాయిశివ నృత్య, మ్యూజిక్ అకాడమీ వారు ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు. కళాకారులకు దేవస్థానం తరఫున ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేసి సత్కరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

స్పందనకు వందనం

పూడిక తీశారు..

రావులపాలెం పట్టణం: రావులపాలెం ఆదిలక్ష్మీనగర్‌లో డ్రెయినేజీ పూడికపోవడంతో మురుగునీరు ముందుకు పారక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు తెలిపిన సమస్యను పంచాయతీ కార్యదర్శి ఎల్.దుర్గాప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లగా స్పందించారు. సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు.

రావులపాలెం గ్రామీణం: రావులపాడులోని డ్రెయిన్లలో వ్యర్థాలు పేరుకుపోవడంతో మురుగు సక్రమంగా పారక దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నట్లు స్థానికులు తెలిపిన సమస్యను పంచాయతీ కార్యదర్శి సాయిపట్టాభిరామయ్య దృష్టికి తీసుకువెళ్లగా స్పందించారు. పారిశుద్ధ్య సిబ్బందిని పంపి డ్రెయిన్లలో పూడిక తీయించారు.

పరిసరాలు శుభ్రం

మామిడికుదురు: నగరం బడుగువారి పేటలో పరిసరాలు అస్తవ్యస్తంగా ఉన్నాయని స్థానికులు చెప్పిన సమస్యను సర్పంచి జాలెం రమణకుమారి, కార్యదర్శి ప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లగా స్పందించారు. అక్కడ చెత్తకుప్పలను తొలగించడంతో పాటు బ్లీచింగ్ చల్లించి పరిసరాలను శుభ్రం చేయించడంతో సమస్యకు పరిష్కారం చేకూరింది.

అంబాజీపేట: మాచవరం పంచాయతీలో ప్రధాన వీధి, మసీదు, పెద్దవీధి ప్రాంతాల్లో పారిశుద్ధ్య లోపాలతో వ్యర్థాలు పేరుకుపోయి ఇబ్బంది పడుతున్నట్లు స్థానికులు తెలిపిన విషయాన్ని సర్పంచి నాగాబత్తుల శాంతకుమారి వద్ద ప్రస్తావించగా స్పందించారు. ఆయా ప్రాంతాలను శుభ్రం చేయించారు.

వీధి దీపాలు వెలిగాయి..

ఆత్రేయపురం: వద్దిపర్రులో వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు తెలిపిన సమస్యను సర్పంచి శ్యామలశ్రీహరి వద్ద ప్రస్తావించగా స్పందించి, దీపాలు వేయించారు.

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: రాజోలు: 80085 74174
పి.గన్నవరం: 80085 74229 కొత్తపేట:90323 93884

నిరీక్షణకు స్వస్తి.. కార్యాచరణ పూర్తి

గృహనిర్మాణ లబ్ధిదారులకు బకాయిల చెల్లింపుపై కసరత్తు

గతంలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన బలహీన వర్గాలకు చెందిన లబ్ధిదారులపై వైకాపా పాలకులు ఏమాత్రం జాలి చూపలేదు. నిర్మాణాలు వివిధ దశల్లో అర్ధాంతరంగా నిలిచిపోయి అవస్థలు పడుతున్నా పట్టించుకోలేదు. బిల్లుల కోసం గత అయిదేళ్లుగా ఆశగా నిరీక్షించారు. కూటమి పాలన రావడంతో అసంపూర్తి నిర్మాణాల పూర్తికి పరిశీలన చేయడం, బకాయిల చెల్లింపులకు కార్యాచరణకు ఉపక్రమిస్తుండటంతో లబ్ధిదారుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి.

- న్యూస్‌టుడే, మామిడికుదురు



కరవాకలో అసంపూర్తిగా ఇంటి నిర్మాణం

గృహనిర్మాణాలకు సంబంధించి 2014 నుంచి 2019 వరకు పనులు చేపట్టిన లబ్ధిదారులకు వైకాపా పాలనలో చెల్లింపులు నిలిచిపోవడంతో వారంతా అయిదేళ్ల పాటు అయోమయంలో కొట్టుమిట్టాడారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వీటిపై దృష్టి పెట్టింది. ఎన్టీఆర్ గృహనిర్మాణ లబ్ధిదారుల పరిశీలనలో భాగంగా సంబంధిత సహాయ ఇంజినీర్లు, సచివాలయ ఇంజినీరింగ్ సిబ్బంది గ్రామాల్లో ఇటీవల చేపట్టిన సర్వే పూర్తయింది. నియోజకవర్గంలోని రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి, మామిడికుదురు మండలాల్లో వివిధ దశల్లో నిలిచిపోయిన గృహాలు 4,765 వరకు ఉన్నట్లు నమోదు చేశారు. ఆయా లబ్ధిదారులకు రూ.12.86 కోట్ల మేర బకాయిలు చెల్లించాల్సి ఉన్నట్లు నిర్ధారించారు. ఇందులో పునాది దశల్లో ఉన్నవి, స్తంభాలు వేసి స్లాబు దశకు చేరుకున్నవి, స్లాబు పనులు పూర్తి అయినవి, నిధులు రాకపోయినా లబ్ధిదారులు ఎలాగోలా నిర్మాణాలను పూర్తి చేసుకున్న వారి వివరాలను నమోదు చేశారు. పునాది దశలో ఉండి ఏవిధమైన బిల్లులు పడని ఇళ్ల నిర్మాణాలను ప్రధానమంత్రి ఆవాస్ యోజనలో లబ్ధి చేకూర్చేందుకు సిద్ధమవుతున్నారు. వీటికి సంబంధించిన పరిశీలనలో భాగంగా లబ్ధిదారుల ఇంటి ప్రస్తుత పరిస్థితితో పాటు వారి బ్యాంకు ఖాతాల వివరాలు, ఆధార్, ఇతర పత్రాలను యాప్‌లో నమోదు చేశారు. దీని ప్రకారం వారికి త్వరలోనే నిధులు మంజూరు కానున్నాయి.

రాజోలు నియోజకవర్గంలో లబ్ధిదారులు, చెల్లించాల్సిన బకాయిల వివరాలు

మండలం	లబ్ధిదారులు	బకాయిలు (రూ.కోట్లలో)
రాజోలు	1,149	3.40
మలికిపురం	1,375	2.98
సఖినేటిపల్లి	1,167	3.77
మామిడికుదురు	1,375	2.71
మొత్తం	4,765	12.86

సర్వే వివరాలు పంపాం

గతంలో గృహనిర్మాణ పథకంలో ఇళ్లు మంజూరై పనులు చేపట్టి వివిధ దశల్లో నిలిచిపోయిన నిర్మాణాలకు సంబంధించిన సమగ్ర వివరాలను యాప్‌లో నమోదు చేసి పంపించాం. నియోజకవర్గ వ్యాప్తంగా వీటిపై పరిశీలన పూర్తయింది. ఎంత మేర చెల్లింపులు చేసినదీ, ఇంకా ఎంత బకాయిలు ఇవ్వాల్సింది వివరాలను సేకరించాం. వీటికి సంబంధించిన బకాయిల నిధులు త్వరలోనే మంజూరు కానున్నాయి. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో బిల్లులు జమకానున్నాయి.

- జె.సత్యనారాయణ, డీఈఈ, రాజోలు

అమ్మవారి సేవలో మంత్రి సుభాష్

రాజోలు, న్యూస్‌టుడే: కడలి వాసంశెట్టివారిపాలెంలో ఉన్న కనకదుర్గమ్మ ఆలయ రజతోత్సవాన్ని పురస్కరించుకుని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమవారం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నాదెండ్లను కలిసిన జనసైనికులు

అంబాజీపేట: మంత్రి నాదెండ్ల మనోహర్‌ను పలువురు జనసేన కార్యకర్తలు సోమవారం విజయవాడలో కలిశారు. తోట బాబి, అరిగెల రాము, బండారు కొండ, సత్యసాయిబాబారెడ్డి, రామ్‌రెడ్డి, మణికంఠరెడ్డి తదితరులు వీరిలో ఉన్నారు.

అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

మలికిపురం: రామరాజులంక పెదతిప్పలో అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన, ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, ఎంపీపీ మేడిచర్ల వెంకటసత్యవాణి, మార్క్‌ఫెడ్ డైరెక్టరు గుండుబోగుల పెద్దకాపు, తిరుమల ఏసుబాబు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన భవన నిర్మాణానికి విరాళం

వాడపల్లి (ఆత్రేయపురం): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద చేపట్టిన వకుళమాత నిత్యాన్నదాన భవన నిర్మాణానికి రాజమహేంద్రవరం మండలం బొమ్మూరుకు చెందిన మత్సేటి శివ, సత్యవతి దంపతులు రూ.50 వేల విరాళాన్ని సోమవారం అందజేశారు. వీరికి స్వామి వారి జ్ఞాపిక అందించి దేవస్థానం పర్యవేక్షకుడు రాపాక శ్రీనివాస్ అభినందించారు.

ఆపదలో ఉన్నవారికి ప్రభుత్వం చేయూత

పి.గన్నవరం: ఆపదలో ఉన్నవారికి కూటమి ప్రభుత్వం ఆర్థికంగా చేయూత అందిస్తుందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. నియోజకవర్గంలో 11 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన రూ.4.23 లక్షల చెక్కులను సోమవారం పి.గన్నవరంలోని క్యాంపు కార్యాలయం వద్ద ఆయన అందించారు. మానేపల్లికి చెందిన కేన్సర్ రోగికి వైద్యం నిమిత్తం ప్రభుత్వం మంజూరు చేసిన రూ.8 లక్షలకు సంబంధించి ఎల్.ఒ.సి.ని అందించారు. శిరిగిడి వెంకటేశ్వరరావు, డీవీవీ సత్యనారాయణ, వాసంశెట్టి కుమార్ పాల్గొన్నారు.

శ్రీశైలానికి బండారు అభిమాని పాదయాత్ర

ఆలమూరు, న్యూస్‌టుడే: సార్వత్రిక ఎన్నికల్లో కొత్తపేట ఎమ్మెల్యేగా బండారు సత్యానందరావు గెలిస్తే స్వగ్రామం జొన్నాడ నుంచి శ్రీశైలం వరకు 470 కి.మీ పాదయాత్ర చేస్తానన్న మొక్కును తీర్చుకునేందుకు తెదేపా నాయకుడు బావన శ్రీనివాస్ సోమవారం బయలుదేరారు. అంతకు ముందు గౌతమి గోదావరి చెంతన ఉన్న శివాలయంలో తెదేపా నాయకులు తాడి శ్రీనివాస్‌రెడ్డి, గొడవర్తి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే సత్యానందరావు జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించారు. పరమేశ్వరుని ఆశీస్సులతో పాదయాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ 20 రోజులపాటు పాదయాత్ర కొనసాగుతుందని, శ్రీశైలంలో మల్లికార్జున జ్యోతిర్లింగం, అమ్మవారిని దర్శించుకుని ముగిస్తానన్నారు. నాయకులు ఆకుల రామకృష్ణ, బండారు సందీప్, సంజీవ్ పాల్గొన్నారు.

అక్రమ విద్యుత్తు కనెక్షన్లు తొలగించండి

మలికిపురం, న్యూస్‌టుడే: స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు గ్రామాల్లోని సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సూచించారు. ఎంపీపీ మేడిచర్ల వెంకటసత్యవాణి అధ్యక్షతన సోమవారం జరిగిన మండల పరిషత్తు సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శంకరగుప్తంలో రెండు పాఠశాలల భవనాలు శిథిల స్థితికి చేరుకున్నాయని.. చింతలమోరిలో రెండు పాఠశాలలు వర్షాకాలంలో ముంపునకు గురవుతున్నాయని, కేశనపల్లిలో పాఠశాలల సమస్యలు ఉన్నాయని, ఇసుక కొరతతో భవన నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోయారని, మండల కేంద్రంలో తాగునీరు, విద్యుత్తు సమస్యలు, గుడిమెళ్లంకలోని సామాజిక భవనానికి మరమ్మతులు, ఎస్సీ శ్మశానవాటిక అభివృద్ధి, సభ్యులకు గౌరవ వేతనం పెండింగు తదితర అంశాలపై సభ్యులు ఏకరవు పెట్టారు. అడవిపాలెంలో చెరువు భూమిని సర్వే చేసి నివేదిక ఇవ్వాలని, గోగన్నమఠం [illegible] ఆక్వా చెరువులకు విద్యుత్తు కనెక్షన్లు తొలగించాలని, విశ్వేశ్వరాయపురం పంచాయతీ సమీపంలో ధ్వంసమైన వంతెన పునర్నిర్మాణం వెంటనే చేపట్టాలని ఎమ్మెల్యే ఆదేశించారు. 216 జాతీయ రహదారి బైపాస్ రింగురోడ్డు, రామేశ్వరం వద్ద వశిష్ఠ నదిపై వంతెన నిర్మాణాలకు సంబంధించి భూసేకరణ విషయంలో రైతులు సహకరించాలని విన్నవించారు. మార్క్‌ఫెడ్ డైరెక్టరు గుండుబోగుల పెద్దకాపు, ఎంపీడీవో బి.మంగాదేవి, జడ్పీటీసీ సభ్యురాలు బళ్ల ప్రసన్నకుమారి మాట్లాడారు. కత్తిమండ ఎంపీటీసీ సభ్యుడు చిట్టాల శ్రీను సత్కరించారు. తహసీల్దారు సీఎస్ రాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



మండల పరిషత్తు సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాద్

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ

కొత్తపేట: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజా దర్బార్ అని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. సోమవారం కొత్తపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ప్రజల నుంచి సమస్యలు స్వీకరించారు. మొత్తం 403 అర్జీలు వచ్చాయని, సమస్యలు పరిష్కారమయ్యే వరకు పర్యవేక్షణ ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. పింఛన్ల కోసం 158, రేషన్ కార్డుల కోసం 36, ఇళ్ల రుణాలు ఇవ్వాలని 59, ఇళ్ల పట్టాల కోసం 116, భూమి పరిహారం కోరుతూ 3, రోడ్లు, విద్యుత్తు స్తంభాలు వేయాలని 28, ఆరోగ్యశ్రీ కార్డుకు 1, అభయహస్తం కార్డు కోసం 2 చొప్పున అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో నాయకులు కంఠంశెట్టి శ్రీనివాసరావు, భూసి జయలక్ష్మి, భాస్కరరావు, ముత్యాల బాబ్జి, రెడ్డి రామకృష్ణ, పాలూరి సత్యానందం, కంఠంశెట్టి చంటి, బీర ఇస్సాక్ పాల్గొన్నారు.

★ రావులపాలెంలోని రూరల్ సీఐ కార్యాలయాన్ని కొత్తపేటకు మార్చాలని స్థానికులు కొందరు సోమవారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారుకు వినతి పత్రం అందించారు. నియోజకవర్గ కేంద్రమైన కొత్తపేటలో ఆర్డీవో, డీఎస్పీ, ఇతర డివిజినల్ కార్యాలయాలతో పాటు సెషన్స్ కోర్టులు ఉన్నాయని, సీఐ కార్యాలయం కూడా ఉంటే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని విన్నవించారు.



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బండారు

ఎంపీడీవోకు సన్మానం

మలికిపురం: మలికిపురం ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహిస్తూ అమలాపురం బదిలీ అయిన బి.మంగాదేవిని మండల పరిషత్తు కార్యాలయంలో సోమవారం సన్మానించారు. ఎంపీపీ మేడిచర్ల వెంకటసత్యవాణి, జడ్పీటీసీ సభ్యురాలు బళ్ల ప్రసన్నకుమారి, ఉప ఎంపీపీ సుందర శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యులు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు కొబ్బరి తోటలకు అనుసంధానం చేయాలి

అంబాజీపేట: కోనసీమలో విస్తారంగా ఉన్న కొబ్బరి తోటల్లో పనులు చేసేందుకు ఉపాధిహామీ పథకం కూలీలను కేటాయించాలని అంబాజీపేటకు చెందిన పలువురు కొబ్బరి రైతులు తహసీల్దారు జె.వెంకటేశ్వరికి సోమవారం వినతిపత్రం అందించారు. ఉద్యాన పంటలకు ఉపాధిహామీ పథకాన్ని అనుసంధానం చేసినప్పటికీ కొబ్బరితోటల విషయంలో ఇంకా స్పష్టత రాలేదన్నారు. ఈ మేరకు ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ముత్యాల జమ్మీలు, ఉప్పుగంటి భాస్కరరావు, కొర్లపాటి కోటబాబు పాల్గొన్నారు.

జగజ్జననీ... పాహిమాం..



పాశర్లపూడిలో..



అంబాజీపేట: శ్యామలానగర్‌లో వీణాశ్యామలాంబ ఊరేగింపు



జి.పెదపూడిలో..



ఉచ్చిలిలో...



రావులపాలెంలో...



పెదపళ్లలో..



ఈతకోటలో...



గుడిమెళ్లంకలో..



అయినవిల్లి సిద్ధివినాయకస్వామి ఆలయంలో అక్షరాభ్యాసాలు

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం పలు గ్రామాల్లో దుర్గమ్మను వివిధ అలంకారాల్లో కొలువుదీర్చారు. చండీ హోమాలు, అభిషేకాలు, సామూహిక కుంకుమ పూజలు చేశారు. అయినవిల్లి సిద్ధివినాయకస్వామి ఆలయంలో చిన్నారులకు అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, మామిడికుదురు, అంబాజీపేట, పి.గన్నవరం, ఆత్రేయపురం, కొత్తపేట, ఆలమూరు, రావులపాలెం పట్టణం, గ్రామీణం, అంతర్వేది, మలికిపురం, అయినవిల్లి

బాధ్యతలు స్వీకరించిన అధికారులు

రావులపాలెం పట్టణం, ఆలమూరు: రావులపాలెం ఎంపీడీవోగా ఇ.మహేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కొత్తపేట నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.



రావులపాలెం ఎంపీడీవో ఇ.మహేష్



ఆలమూరు డీటీ సుబ్బరాజు

★ ఆలమూరు డిప్యూటీ తహసీల్దార్‌గా తేతలి సుబ్బరాజు, మండల సర్వేయర్‌గా ఎం ప్రభావతి బాధ్యతలు స్వీకరించారు. మండపేట పౌరసరఫరాల అధికారిగా పనిచేసిన సుబ్బరాజు, ఆత్రేయపురం నుంచి ప్రభావతి బదిలీపై ఇక్కడికి వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు.

తూ.గో.జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపిక

అంబాజీపేట: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అండర్-14 క్రికెట్ జట్టుకు అంబాజీపేట ఉన్నత పాఠశాల విద్యార్థి సీహెచ్ లక్ష్మీనారాయణ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు కడలి సాయిరాం, పీడీ కుంపట్ల ఆదిలక్ష్మి సోమవారం తెలిపారు. త్వరలో కడపలో జరిగే పోటీల్లో పాల్గొంటాడన్నారు. ఈ విద్యార్థిని పలువురు అభినందించారు.



లక్ష్మీనారాయణ

డీఎస్సీ-2008 ఉపాధ్యాయ పోస్టులు భర్తీచేయాలి

అంబాజీపేట: డీఎస్సీ-2008 ఎస్జీటీ పోస్టులు శాశ్వత లేదా ఒప్పంద పద్ధతిలో భర్తీ చేయాలని టీచర్ ట్రైనీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కడలి వెంకటేశ్వరరావు కోరారు. సోమవారం అమరావతిలో నిర్వహించిన ప్రజావేదికలో తెదేపా నేత రెడ్డి సుబ్రహ్మణ్యానికి వినతిపత్రం అందజేసినట్లు ఆయన విలేకరులకు చెప్పారు.

యువతి అదృశ్యం

అంబాజీపేట, న్యూస్‌టుడే: మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతికి 20 రోజుల క్రితం వివాహం నిశ్చయమైంది. ఈ క్రమంలో ఆమె ఇంటినుంచి వెళ్లిపోయింది. చుట్టుపక్కలతో పాటు బంధువుల ఇళ్లవద్ద వెతికినా ప్రయోజనం లేకపోవడంతో ఆమె తాత సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సూర్యనారాయణ తెలిపారు.

చెడు వ్యసనాలకు బానిసై దొంగతనాలు

విశాఖపట్నం: చెడు వ్యసనాలకు బానిసై దొంగతనాలకు పాల్పడిన ఇద్దరిని పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో క్రైం ఏడీసీపీ మోహన్‌రావు వివరాల్ని వెల్లడించారు. గన్నవరం గ్రామానికి చెందిన రాయుడు నర్సింహమూర్తి, చల్లపల్లి ప్రసాద్‌లు చెడు వ్యసనాలకు బానిసై దొంగతనాలకు పాల్పడేవారు. ఈ ఏడాది జులైలో ద్వారకా స్టేషన్ పరిధిలో శాంతిపురం పంజాబీదాబా, సంగం శరత్‌థియేటర్, జైలురోడ్డు, వైఎంసీఏ బీచ్‌రోడ్డు, ఏకేసీ కాలనీ, కాకినాడ ప్రాంతాల్లో ఆటోలు, మోటారు సైకిళ్లు దొంగతనం చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్ఐ రాజు దర్యాప్తు జరిపి వారిని చాకచక్యంగా పట్టుకున్నారు. మూడు ఆటోలు, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కేసులో చాకచక్యంగా వ్యవహరించిన సిబ్బందిని అభినందించారు.

హత్య కేసులో నిందితులను అరెస్టుకు డిమాండ్

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: అయినవిల్లి మండలానికి చెందిన వాలంటీరు జనిపెల్ల దుర్గాప్రసాద్ హత్యకేసులో నిందితులను వెంటనే అరెస్టు చేయాలని దళితసంఘాల ప్రతినిధులు కలెక్టరేట్ వద్ద సోమవారం నిరసన తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌లో జేసీ నిశాంతికి వినతిపత్రం అందజేశారు.



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న అయినవిల్లి వాసులు

సీపీఐ శాంతి ర్యాలీ

మలికిపురం, న్యూస్‌టుడే: పాలస్తీనాపై యుద్ధాన్ని నిలిపివేసి శాంతిని నెలకొల్పాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో మలికిపురంలో సోమవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ సుదీర్ఘకాలంగా చేస్తున్న యుద్ధం వల్ల 42 వేల మందికిపైగా ప్రజలు చనిపోయారని, ఇలాగే కొనసాగితే ఇంకెంత మారణహోమం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్, చెల్లుబోయిన తాతారావు, నల్లి బుజ్జిబాబు, దొండపాటి భానోజి పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న సీపీఐ నాయకులు

రహదారుల అభివృద్ధికి వినతి

మామిడికుదురు: రహదారుల అభివృద్ధికి నిధులు కేటాయించాలని మండల సర్పంచుల సమాఖ్య కోరింది. మండల సమాఖ్య అధ్యక్షురాలు జాలెం రమణకుమారి అధ్యక్షతన నగరం పంచాయతీ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. గౌరవ వేతనాన్ని రూ.15 వేలకు పెంచాలని కోరారు. అడబాల తాతకాపు, సర్పంచులు పాల్గొన్నారు.

రూ.49.93 కోట్లతో అభివృద్ధి పనులు

అంబాజీపేట, న్యూస్‌టుడే: అంబాజీపేట మండలంలో రూ. 49.93 కోట్ల అంచనాతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం ఎంపీడీవో జి.సరోవర్ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఇందులో వివిధ శాఖలకు సంబంధించి చేపట్టే అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

గొల్లపాలెం సబ్‌స్టేషన్ స్థాయి పెంపు అవసరం

మలికిపురం, న్యూస్‌టుడే: మలికిపురం మండలం గొల్లపాలెం విద్యుత్తు సబ్‌స్టేషన్ స్థాయిని మరింత పెంచాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ కోరారు. ఈ స్టేషను పరిధిలో విద్యుత్తు సమస్యలు తలెత్తుతున్నాయని వినియోగదారుల నుంచి వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో సోమవారం ఏఈ బి.ప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. 5 ఎం.వి.ఎ. సామర్థ్యం ఉన్న రెండు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నప్పటికీ ఒకటి ఖాళీగా ఉందని, 11 కె.వి. సామర్థ్యం ఉన్న అదనపు ఫీడరు ఏర్పాటు చేస్తే రెండూ ఉపయోగంలోకొచ్చి ప్రయోజనం ఉంటుందని ఎమ్మెల్యే దృష్టికి ఏఈ తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మేడిచర్ల సత్యవాణి, ఉపఎంపీపీ సుందర శ్రీనివాస్, మార్క్‌ఫెడ్ డైరెక్టరు పెద్దకాపు, చాగంటి స్వామి, సర్పంచులు మందపాటి నాగేశ్వరరావు, యెనుముల నాగు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఆత్రేయపురంలో పంట కాలువపై రక్షణ గోడలు లేని కల్వర్టు



పలివెలలో శిథిలస్థితికి చేరి...

రక్షణ లేని వంతెనలు.. అమలుకాని ప్రతిపాదనలు

న్యూస్‌టుడే – ఆత్రేయపురం, కొత్తపేట

రోజూ పదివేల వాహనాలు (నాలుగు చక్రాలు) పయనిస్తే ఆ రహదారిని రెండు లైన్లుగా విస్తరించాలి. అటువంటి రహదారులపై వంతెనలు కనీసం 25 అడుగుల వెడల్పు ఉండాలి. ఈ నిబంధనలను అనుసరించి రహదారులను విస్తరిస్తున్నప్పటికీ వంతెనలను మాత్రం వెడల్పు చేయడం లేదు. 40 ఏళ్ల కిందట ర.భ శాఖ నిర్మించిన వంతెనల పరిస్థితిపై 2012లో పుణెకు చెందిన సంస్థతో అప్పటి ప్రభుత్వం సర్వే చేయించింది. మూడొంతుల వంతెనలను పునర్నిర్మించాలని ప్రతిపాదించింది. నియోజకవర్గంలో రోడ్లు, భవనాల శాఖకు చెందిన సుమారు 20 వంతెనలు ప్రమాదకరంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వాటి పునర్నిర్మాణానికి రూ.30 కోట్ల వరకు వ్యయం అవుతుందని అంచనాలు రూపొందించారు. ఏటా 8 నుంచి 10 శాతం అంచనా వ్యయం పెరుగుతోంది తప్ప కార్యాచరణ మాత్రం లేదు. కొత్తపేట నియోజకవర్గంలో బలహీనంగా ఉన్న వంతెనలపైనే ప్రజలు భయాందోళనలతో రాకపోకలు సాగిస్తున్నారు.

శాఖల మధ్య కొరవడిన సమన్వయం

రహదారుల్లో ప్రధాన కాలువలపై ఉన్న లాకులు కూడా దెబ్బతిన్నాయి. వీటి నిర్మాణానికి ర.భ, జల వనరుల శాఖల మధ్య సమన్వయ లోపం కనిపిస్తోంది. అమలాపురం-బొబ్బర్లంక రాష్ట్రీయ రహదారిలో ఆత్రేయపురం సమీపంలోని బ్యాంక్ కెనాల్ లాకులు శిథిలస్థితికి చేరుకోవడంతో వాహనాల రద్దీకి తట్టుకోలేకపోతోంది. కొత్తపేట మండలం బోడిపాలెం, పలివెల వంతెనల పరిస్థితి కూడా ఇదే విధంగా ఉంది. ఇటీవల పంచాయతీరాజ్ శాఖ నుంచి ర.భ శాఖలోకి బదిలీ అయిన కొన్ని వంతెనలు, కల్వర్టులు కూడా దెబ్బతిన్నాయి. జిల్లాలో పలు దెబ్బతిన్న వంతెనలను ర.భ శాఖ గుర్తించింది. వాటి నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించినట్లు ర.భ. శాఖ ఏఈఈ మణికుమార్ తెలిపారు.

అందరికీ న్యాయ సహాయం

రాజోలు, న్యూస్‌టుడే: రాజోలు మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచిత న్యాయసహాయం కోసం ముద్రించిన కరపత్రాలను సీనియర్ సివిల్‌జడ్జి జి.ప్రమీలారాణి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ న్యాయసేవాధికార సంస్థ అందరికీ న్యాయం కోసం కృషి చేస్తోందన్నారు. ఉచిత న్యాయం కోసం 15100 టోల్‌ఫ్రీ నంబరులో సంప్రదించాలన్నారు. న్యాయవాదులు జి. రజిత, స్టాలిన్, చింతా ప్రసాద్, మెడబల రాజ్‌కుమార్, చెల్లింగి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీనియర్ సివిల్‌జడ్జి ప్రమీలారాణి తదితరులు

వార్డు సభ్యులకు శిక్షణ

కాట్రేనికోన: మండలంలోని ఉపసర్పంచులు, వార్డు సభ్యులకు రెండ్రోజుల శిక్షణ కార్యక్రమం స్థానిక మండలపరిషత్తు కార్యాలయంలో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పంచాయతీ పాలన, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సమస్యలు తదితర అంశాలపై ఎంపీడీవో వెంకటేశ్వరరావు అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోను కలిసిన సర్పంచులు

అమలాపురం గ్రామీణం: అమలాపురం ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన బాబ్జీరాజును మండలంలోని పలువురు సర్పంచులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సునీత, ఏసుబాబు, నాని, ప్రసన్న, ప్రవీణ్, విజయ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం

• అమలాపురం • ముమ్మిడివరం

సమస్యలు పరిష్కరిస్తాం

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: ఫిర్యాదులపై విచారణ పూర్తి చేసి పరిష్కరించాలని ఎస్పీ బి.కృష్ణారావు అధికారులను ఆదేశించారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణారావు



మహిళ నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

అనధికారిక చెరువులు తొలగించాల్సిందే..

అల్లవరం, న్యూస్‌టుడే: మండలంలోని సముద్ర తీర ప్రాంతంలో అనధికారికంగా సాగు చేస్తున్న రొయ్యల చెరువులను తొలగిస్తేనే ముంపు సమస్యకు పరిష్కారం దొరుకుతుందని ఎమ్మెల్యే ఆనందరావు అన్నారు. సోమవారం ఆయన అల్లవరం ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ ఇళ్ల శేషారావు అల్లవరం మండలం శివారులకు ముంపు నుంచి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ తీరంలో, పల్ల భూముల్లో, బిత్తడి నేలల్లో అనధికారికంగా సాగు చేస్తున్న రొయ్యల చెరువుల వివరాలు సేకరించి, చర్యలు తీసుకుంటే తప్ప, ముంపు సమస్య కొలిక్కి రాదన్నారు. దీనిపై రైతులందరూ కలిసి ఓ నిర్ణయం తీసుకోవాలన్నారు. సత్యనారాయణపురానికి చెందిన పలువురు మహిళలు సర్వే వ్యక్తి తమను ఇళ్లు నిర్మించుకోకుండా అడ్డుపడుతున్నాడని ఫిర్యాదు చేశారు. లో ఓల్టేజీ, రహదారుల నిర్మాణాలపై ఆయనకు వినతులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మెట్ల రమణబాబు, ఎంపీడీవో కృష్ణమోహన్, తహసీల్దార్ నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాలకు బానిసై దొంగతనాలు



వివరాలు వెల్లడిస్తున్న పోలీసు అధికారులు

విశాఖపట్నం (నేర వార్తలు), న్యూస్‌టుడే: వ్యసనాలకు బానిసై విశాఖ నగరంలో పలు దొంగతనాలకు పాల్పడిన ఇద్దరిని ద్వారకా పోలీస్ స్టేషన్ పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సోమవారం రాత్రి స్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో క్రైం ఏడీసీపీ మోహన్‌రావు వివరాలు వెల్లడించారు. అమలాపురం దర గన్నవరం గ్రామానికి చెందిన రాయుడు నర్సింహమూర్తి(39), పల్లపల్లి ప్రసాద్ అనే వ్యక్తులు వ్యసనాలకు బానిసై దొంగతనాలకు పాల్పడేవారు. ఈ ఏడాది జులైలో ద్వారకా స్టేషన్ పరిధిలో శాంతిపురం, సంగం శరత్ థియేటర్, జైలురోడ్డు, వైఎంసీఏ బీచ్‌రోడ్డు, ఏవోబీ కాలనీ, కలెక్టర్ కార్యాలయం ప్రాంతాల్లో ఆటోలు, మోటారు సైకిళ్లు దొంగతనం చేశారు. ద్వారకా స్టేషన్‌కు సంబంధించి బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్.ఐ. రాజు దర్యాప్తు జరిపి వారిని చాకచక్యంగా పట్టుకున్నారు. వారి నుంచి మూడు ఆటోలు, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కేసులో చాకచక్యంగా వ్యవహరించిన సిబ్బందిని అభినందించారు. సమావేశంలో జోన్ -1 ఏసీపీ వెంకట్రావ్, ద్వారకా సబ్‌డివిజన్ క్రైం ఇంఛార్జి సీఐ కొరాడ రామారావు, ఎస్.ఐ. రాజు, తదితరులు పాల్గొన్నారు.








శ్రీలలిత త్రిపురసుందరీదేవి రూపంలో వైభవ్ కనకదుర్గ అమ్మవారు, వేపచెట్టు శ్రీకనకదుర్గ అమ్మవారు, భవానీనగర్ కల్యాణదుర్గ అమ్మవారు | బాలా త్రిపుర సుందరి దేవిగా వాసవీమాత | యానాం: అన్నపూర్ణాదేవిగా లలితాదేవి | చినకొత్తలంకలో..

దుర్గాదేవీ శరణు.. శరణు

అమలాపురం పట్టణం, ముమ్మిడివరం, యానాం, కాట్రేనికోన, ఉప్పలగుప్తం: దసరా మహోత్సవాల్లో భాగంగా అమ్మవార్లు సోమవారం వివిధ అలంకరణలలో పూజలు అందుకున్నారు. మంగళవారం వాసవీమాత అమ్మవారి ఆలయప్రాంగణాన్ని రూ. 3.33 కోట్లతో అలంకరించనున్నట్లు ఆర్యవైశ్య సంఘ నాయకులు తెలిపారు. అమ్మవారు శ్రీమహాలక్ష్మిగా దర్శనమిస్తారన్నారు. ఆలయాల వద్ద సామూహిక కుంకుమార్చనలు, హోమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, తెదేపా నాయకులు శ్రీదేవి అమ్మవారిని దర్శించుకున్నారు. ముమ్మిడివరం మండలం అనాతవరం సావరంలోని కనకదుర్గ అమ్మవారిని శాకాంబరిదేవిగా అలంకరించారు. చినకొత్తలంకలోని వివిధ రకాల కూరగాయలతో శాకాంబరి దేవిగా అలంకరించారు.



శ్రీదేవి అమ్మవారి ఆలయం వద్ద ఎమ్మెల్యే ఆనందరావు, తెదేపా నాయకులు

పట్టణంలో ఆక్రమణలన్నీ తొలగించాలి

• కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్సీ, వైకాపా కౌన్సిలర్ల డిమాండ్

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: అమలాపురం పట్టణంలో చెరువులు, మురుగుకాలువలు, రహదారులపై ఆక్రమణలు పెరిగిపోయాయని, వాటిని తొలగించాలని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, వైకాపా కౌన్సిలర్లు పట్టుబట్టారు. అమలాపురం పురపాలక సంఘ కార్యాలయంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి అధ్యక్షతన సోమవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు.

54 అంశాలకు ఆమోదం..

ఈ సందర్భంగా అజెండాలోని 54 అంశాలను ఆమోదించారు. జనసేన పార్టీ కౌన్సిలర్ పడాల శ్రీదేవి మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయం పక్కన ఉన్న భవనానికి మరమ్మతులకు రూ.5 లక్షలు ఖర్చు పెట్టడం ఏమిటని ప్రశ్నించగా దానిని రద్దు చేశారు. ఇప్పటికే గుత్తేదారు పనులు ప్రారంభించడం గమనార్హం. ప్రధాన తపాలా కార్యాలయం వెనుక మాజీ ఎమ్మెల్యే కుడుపూడి చిట్టబ్బాయ్ విగ్రహం, హైస్కూల్ సెంటర్‌లో దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహాల ఏర్పాటుపై హైకోర్టులో కేసు వేయడం ఏమిటని, పట్టణంలో అన్ని చోట్లా ఆక్రమణలు, విగ్రహాలు ఉన్నాయని వాటిని తొలగించాల్సిందేనని వైకాపా కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. పట్టణంలో రూ. 38 లక్షలు ఖర్చు పెట్టినా స్వచ్ఛమైన మంచీనీరు అందించలేక పోతున్నామని, రూ. కోట్లు వెచ్చించినా ప్రజలకు కనీస సౌకర్యాలు అందించలేకపోతున్నామని తెదేపా కౌన్సిలర్ బొర్రా వెంకటేశ్వరరావు ప్రశ్నించారు. గడియారస్తంభం మీద జాతీయజెండా ఎగురవేయాలని మున్సిపల్ ప్రతిపక్ష నాయకుడు ఏడిద శ్రీను కోరారు.



మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఛైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, మున్సిపల్ కమిషనర్ రాజు, తదితరులు

అప్పుడు ఎందుకు చెప్పలేదు..

పురపాలక సంఘంలోని 15వ ఆర్థిక సంఘం మిగులు నిధులు రూ. 78 లక్షలు వెనక్కి పంపించిన విషయం కౌన్సిలర్లకు ఎందుకు చెప్పలేదని జనసేన పార్టీ కౌన్సిలర్ గండి దేవిహారిక ప్రశ్నించారు. దీనిపై మున్సిపల్ డీఈ సతీష్ మాట్లాడుతూ గత నెల 30న సమావేశం రద్దు కావడంతో వీలుకాలేదన్నారు. గత మున్సిపల్ కమిషనర్ కౌన్సిలర్లకు చెప్పకుండానే రూ.6 కోట్ల బిల్లులు చెల్లించారని, దీనిపై విజిలెన్స్ విచారణ జరపాలని ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు కోరారు. పూర్తిస్థాయిలో వీధిదీపాలు వెలగడంలేదని, అధికారులు దృష్టి పెట్టాలని తెదేపా కౌన్సిలర్ అబ్బిరెడ్డి చంటి కోరారు. సమావేశంలో పిండి అమరావతి, తిక్కా సత్యలక్ష్మి, సంసాని నాని, మట్టపర్తి నాగేంద్ర, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గోడు వినాలి.. ఆదుకోవాలి

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పలువురు జేసీ నిశాంతికి వినతులు అందజేశారు. సమస్యలు పరిష్కరించాలని వేడుకున్నారు. వివిధ సంఘాల ప్రతినిధులు నిరసనలు తెలిపి అధికారులకు వినతులు అందజేశారు.



అర్జీలు స్వీకరిస్తున్న నిశాంతి

ధ్రువీకరణ పత్రం ఉన్నవారికే..

నూతన మద్యంపాలసీలో కల్లుగీత కార్మికులకు దుకాణాలు కేటాయిస్తుండటంతో గుర్తింపు కార్డులు ఉన్నవారు వాటిని దుర్వినియోగం చేస్తున్నారు. జిల్లాలో సుమారు 20వేల మందికి గుర్తింపు కార్డులు ఉన్నాయి. కల్లుగీత ధ్రువీకరణ పత్రం ఉన్నవారికే కేటాయించాలి.

-కల్లుగీత కార్మిక సంఘ నాయకులు

పాస్‌పుస్తకాలు అందించాలి..



కాంట్రేనికోన మండలం కందికుప్ప గ్రామంలో మా మామగారి ఆస్తి 2 ఎకరాల పొలం ఉంది. ఆయన మృతి చెందిన తర్వాత ఆ భూమి మా పేరిట ఆన్‌లైన్ చేయట్లేదు. దీనికి ఓ వ్యక్తి అడ్డుపడుతున్నారు. ఆన్‌లైన్ చేసి పాస్‌పుస్తకాలు అందించాలి.

-బొజ్జా విజయ, కందికుప్ప, కాంట్రేనికోన మండలం

మేమున్నాం.. మీకు తోడుగా

వీధి దీపాలకు మరమ్మతులు

సమస్య: గెద్దనపల్లి పంచాయతీ పరిధిలోని బక్కివారిపేటలో కొన్ని వీధి దీపాలు వెలగడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి వీధిదీపాలకు మరమ్మతులు చేపట్టాలి. - **స్థానికులు**

పరిష్కారం: సమస్యను పంచాయతీ సర్పంచి రఘురామకృష్ణంరాజు దృష్టికి తీసుకువెళ్లగా స్పందించారు. సిబ్బందితో వీధిదీపాలకు అవసరమైన మరమ్మతులు చేయించారు.

- న్యూస్‌టుడే, కాట్రేనికోన

చెత్త తొలగించారు

సమస్య: కాట్రేనికోనలో రోడ్డుపక్కన పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. పంచాయతీ అధికారులు స్పందించి చెత్తను తొలగించే పనులు చేపట్టాలి. - **గ్రామస్థులు**

పరిష్కారం: ఈ సమస్యను సర్పంచి సుధాకర్‌కు తెలుపగా స్పందించారు. సిబ్బందితో పరిసరాల్లో చెత్తను తొలగించారు.

- న్యూస్‌టుడే, కాట్రేనికోన

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:
అమలాపురం: 79939 35935, ముమ్మిడివరం: 80085 74166



కలెక్టరేట్‌వద్ద నిరసన తెలుపుతున్న విలసవిల్లి వాసులు

శ్మశాన వాటికకు రోడ్డు నిర్మించాలి

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: శ్మశానవాటికకు రహదారి నిర్మించాలని విలసవిల్లిలోని బీరవారి పేట, సిద్ధార్థనగర్, వడ్డిచెరువు కాలనీ వాసులు నిరసన తెలిపారు. 400 దళిత కుటుంబాలు నివసించే ఈ కాలనీలకు శ్మశాన వాటికకు రహదారి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పొలమూరి మోహన్ బాబు, కుంచేబాబులు, వస్కా మల్లేశ్వరరావు, అంబేడ్కర్, కారెం వెంకటేశ్వరరావు, వెన్నపు దొరబాబు తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనంపై విధులకు వెళ్తున్న ఏఎన్‌ఎం, ఆమె కుమార్తెను వెనుక నుండి ఆటో ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని సీహెచ్.గున్నేపల్లికి చెందిన మొల్లి మంగాయమ్మ కొమానపల్లిల్లో ఏఎన్‌ఎంగా పనిచేస్తున్నారు. సోమవారం ఉదయం ఐదేళ్ల కుమార్తె జానుని తీసుకుని ద్విచక్ర వాహనంపై విధులకు వెళ్తుండగా పల్లిపాలెం సెంటర్లో వెనుక నుంచి వచ్చిన ఆటో ఢీకొట్టడంతో గాయపడ్డారు. చికిత్స నిమిత్తం ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

లోపలికి వెళ్లేదెలా..?



యానాంలో 20 ప్రభుత్వ కార్యాలయాలు ఉన్న మినీ సివిల్ స్టేషన్ పరిస్థితి ఇది. ముఖ ద్వారం వద్ద కారు పార్కింగ్ చేశారు. దీంతో ఇబ్బందులు పడుతూ రాకపోకలు సాగించారు.

-న్యూస్‌టుడే, యానాం

తాగునీరందక.. దాహం తీరక

• బండారులంకలో ప్రజల అవస్థలు

అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: బండారులంక గ్రామస్థులను తాగునీటి వెతలు వెంటాడుతున్నాయి. ఇక్కడ పదివేలకు పైగా జనాభా ఉన్నా, ఆ స్థాయిలో ఏర్పాట్లు లేవు. ఇక్కడి ఏకైక తాగునీటి ప్రాజెక్టు (పీడబ్ల్యూఎస్) ద్వారా నీరందిస్తున్నారు. శివారు ప్రాంతాలతోపాటు పలు కాలనీలకు ఇప్పటికీ నీరు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బయట తాగునీరు కొనుగోలు చేసుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. గత అయిదేళ్లలో తాగునీటి కోసం నిధులు వెచ్చించలేదని, ఈ ప్రభుత్వంలోనైనా గొంతు తడపాలని కోరుతున్నారు.



గ్రామంలోని తాగునీటి ట్యాంకు

రెండే ఫిల్టర్ బెడ్లు..

గ్రామంలోని శ్మశానవాటిక చెంతన పీడబ్ల్యూఎస్ ప్రాజెక్టు ద్వారా గ్రామ ప్రజలకు తాగునీరు అందిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. అయితే ఏళ్ల తరబడి ఇక్కడ రెండే ఫిల్టర్ బెడ్లు ఉండటంతో వాటితోనే తాగునీరు శుద్ధి చేసి ప్రజలకు అందిస్తున్నారు. గతం నుంచీ ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేసే దిశగా చర్యలు చేపట్టకపోవడంతో గ్రామంలోని శివారు ప్రాంతాలతోపాటు పలు కాలనీలకు అరకొరగానే తాగునీరు అందుతోందని ప్రజలకు ఆవేదన చెందుతున్నారు.

బండారులంక వివరాలు..

జనాభా(2011 లెక్కల ప్రకారం)	:	11,481
తాగునీటి ట్యాంకులు	:	03
నీటి సరఫరా	:	3.60 లక్షల లీటర్లు



ఫిల్టర్‌బెడ్‌లో పచ్చరంగులో నీరు

ప్రతిపాదనలు సిద్ధం చేశాం

గ్రామంలో తాగునీటి సమస్యను అధిగమించేందుకు వాటర్ గ్రిడ్ పథకాన్ని తీసుకొస్తున్నాం. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. ఇటీవల ఒక ఫిల్టర్ బెడ్ బాగు చేయించాం. మరొకటీ చేస్తాం. ప్రజలకు తాగునీరు అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటాం.

-చినబాబు, ఆర్‌డబ్ల్యూఎస్, ఏఈ, అమలాపురం

బీమా ఏజెంట్ల నిరసన



ఎల్ఐసీ బ్రాంచి కార్యాలయం వద్ద నినదిస్తున్న ఏజెంట్లు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పిలుపు మేరకు సంఘ సభ్యులు సోమవారం అమలాపురంలోని ఎల్ఐసీ బ్రాంచి కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఏజెంట్లకు నష్టం కలిగించే చర్యలు చేపట్టవద్దని డిమాండ్ చేశారు. అనంతరం సీఈవోకు వినతిపత్రం అందజేశారు. సంఘ అమలాపురం శాఖ అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డ్ మార్చాలని డిమాండ్

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: ముమ్మిడివరంలో సీపీఎం పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషిచేయాలని జిల్లా సమన్వయకర్త కారెం వెంకటేశ్వరరావు తెలిపారు. ముమ్మిడివరంలో డి.రాఘవులు అధ్యక్షతన సీపీఎం మహాసభ సోమవారం నిర్వహించారు. పార్టీ జెండా ఆవిష్కరించిన అనంతరం నాయకులు మాట్లాడారు. నూతనశాఖ కార్యదర్శిగా సఖిలే సూర్యనారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డ్రెయిన్లను, కాట్రేనికోన-ముమ్మిడివరం రోడ్డు నిర్మించాలని, మార్కెట్‌ను ఆనుకుని ఉన్న డంపింగ్‌యార్డు మార్పుచేయాలని డిమాండ్ చేశారు. బాలయ్య, జి.దుర్గాప్రసాద్, కె. లక్ష్మణ్, మంగాదేవి పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన

అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ఎన్డీయే ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. ఈదరపల్లిలో రూ. 40లక్షలతో నిర్మించే మురుగు కాలువకు తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబుతో కలిసి సోమవారం శంకుస్థాపన చేశారు. సర్పంచి రాయుడు వరలక్ష్మి, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు అధికారి జయవెంకటలక్ష్మి, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమణశ్రీ

ప్రజాస్వామ్యాన్ని గౌరవించాలి

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు, విధులను, ప్రజాస్వామ్యాన్ని ప్రతి పౌరుడు గౌరవించాలని ఎంఈవో బి.రమణశ్రీ అన్నారు. ఇండియన్ సోషల్ ఇన్‌స్టిట్యూట్ బెంగళూరు వారి సహకారంతో పీపుల్స్ సర్వీస్ ఆర్గనైజేషన్, బాలికా ఆర్గనైజేషన్ అయినవిల్లి, కార్మిలేట్ సిస్టర్స్ ఆఫ్ థెరిసా ఆర్గనైజేషన్ అమలాపురం ఆధ్వర్యంలో స్థానిక బాలికోన్నత పాఠశాలలో మూడురోజుల పాటు ప్రజాస్వామ్యం-రాజ్యాంగం అనే అంశంపై శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభించారు. సీడీపీవో వి.విమల, ఎం.అబ్బులు, కరుణారావు, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సామాజిక భవనం.. నెరవేరని లక్ష్యం

ఉప్పలగుప్తం మండలం చల్లపల్లిలో 2016లో తెదేపా ప్రభుత్వ హయాంలో రూ.కోటితో సామాజిక భవన నిర్మాణాన్ని ప్రారంభించింది. వైకాపా అధికారంలోకి వచ్చాక నిధులు మంజూరు చేయక పోవడంతో ఆ నిర్మాణం నిలిచిపోయింది. స్థానికులు సమావేశాలు, శుభకార్యాలు నిర్వహించుకునేందుకు సుమారు 15 కిలోమీటర్ల దూరంలోని అమలాపురం వెళ్లాల్సి వస్తోంది. కూటమి ప్రభుత్వం భవనానికి నిధులు మంజూరు చేసి పూర్తి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయాన్ని పీఆర్ జేఈ రాధాకృష్ణ వద్ద ప్రస్తావించగా మిగిలిన పనులకు ప్రతిపాదనలు పంపించామని తెలిపారు.

- న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం

ఇదేనా స్వచ్ఛత..?

అమలాపురం మండలం సమనసలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం అధ్వానంగా మారింది. తెదేపా హయాంలో ఈ నిర్మాణాన్ని ప్రారంభించగా.. మధ్యలోనే నిలిచిపోయింది. గత అయిదేళ్ల కాలంలో పట్టించుకోలేదు. ఈ కేంద్రం చుట్టూ తుప్పలు పెరగడంతో మందుబాబులకు అడ్డాగా మారింది. ఈ సమస్యను పంచాయతీ కార్యదర్శి పి.శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లగా.. తుప్పలు తొలగిస్తామని కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకొచ్చే విధంగా చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

- న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం



మండపేట

• మండపేట • రామచంద్రపురం

గర్భిణులకు సామూహిక సీమంతాలు

పామర్రు, న్యూస్‌టుడే: కె.గంగవరం మండలం సత్యవాడలో శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గ్రామానికి చెందిన 16 మంది గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఆధ్యాత్మికవేత్త పోలిశెట్టి వెంకట్రావు ఆధ్వర్యంలో కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిగాయి. కె.గంగవరానికి చెందిన సౌభాగ్యలక్ష్మి రైస్ మిల్లు వారి సౌజన్యంతో పసుపు, కుంకుమ, గాజులు, చీర, జాకెట్టు తదితర సామగ్రి అందచేశారు. అనంతరం సామూహిక గీతాపారాయణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కళాజాతరకు ఆహ్వానం


సింగుబాబు

పామర్రు, న్యూస్‌టుడే: అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఈ నెల 19, 20వ తేదీల్లో తాడేపల్లిగూడెంలోని బుద్ధాల కన్వెన్షన్ హాల్లో జరిగే ప్రపంచ తెలుగు సాహితీ-కళాజాతరలో పాల్గొనాల్సిందిగా తెలుగు ఉపాధ్యాయుడు సంపర వేణుగోపాలసింగు బాబుకు ఆహ్వానం అందింది. కవితాగానం లేదా కళా ప్రదర్శనలో అంశాలు చేయాలని కోరింది. కళాజాతరలో పాల్గొనే అవకాశం రావడంపై సింగుబాబు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కవి సమ్మేళనం, సాహిత్య సదస్సులు, రంగస్థల కళాప్రదర్శనలు, పుస్తకావిష్కరణ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా సమయం: ఉ.10 గం నుంచి ఉ.11 గం వరకు

మండపేట: 80085 74183, రామచంద్రపురం: 80085 74191

ప్రత్యేక పారిశుద్ధ్య పనులు

స్పందనకు వందనం


పరిసరాలను శుభ్రం చేస్తున్న సిబ్బంది

ద్వారపూడి, న్యూస్‌టుడే: ద్వారపూడి పంచాయతీ వంతెనవారి రామాలయం వీధిలో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా ఉందని, దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు తెలిపిన సమస్యను పంచాయతీ కార్యదర్శి ఆకుల రమణ తెలపగా స్పందించారు. చెత్త తీయించి బ్లీచింగ్ చల్లించారు.

✦ జడ్.మేడపాడు పంచాయతీ పరిధి ఎస్సీ కాలనీ వాటర్ ట్యాంకు వీధిలో రహదారి పక్కన చెత్త పోస్తున్నారని కాలనీవాసులు తెలిపిన సమస్యను పంచాయతీ కార్యదర్శి వి.అమర్‌నాథ్‌చౌదరికి వివరించగా స్పందించారు. రహదారి పక్కన చెత్తను తీయించారు.

సారూ.. మీపైనే ఆశలన్నీ..

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు మొర

మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం మండపేట ఎంపీడీవో కార్యాలయంలో జరిగింది. కలెక్టర్ మహేష్‌కుమార్‌తోపాటు జిల్లా, డివిజన్ అధికారులు తరలిరావడంతో అనేక మంది బాధితులు అర్జీలతో తరలివచ్చారు.

ఇవిగో విన్నపాలు...

● మండపేట ఒకటో వార్డుకు చెందిన కోరుకొండ శ్రీనివాస్ పక్షవాతంతో బాధపడుతుండగా పింఛను పెంచి ఇవ్వాలని కుటుంబ సభ్యులు కోరారు.

● ఆర్థిక అవసరాల కోసం కొంత మొత్తం డబ్బులు తీసుకుంటే ప్రామిసరీ నోట్లు, దస్తావేజులు తీసుకొని ఇవ్వడం లేదని, తమను మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని కాల్‌మనీ బాధితులు వినతిపత్రం అందజేశారు.

● జొన్నాడ-మండపేట, మండపేట- ద్వారపూడి రహదారి నిర్మాణం చేయాలని అఖిలభారత కాంగ్రెస్ పార్టీ సభ్యులు కామన ప్రభాకరరావు కలెక్టరును కోరారు. వాహనదారులు, స్థానికులు పడుతున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకొచ్చారు.

● మండల కేంద్రం రాయవరం గ్రామానికి చెందిన యార్లగడ్డ అబ్బులు అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఐదేళ్ల నుంచి వైద్యసేవలు అందుకుంటున్నారు. ఇప్పటివరకు వచ్చే రూ. 6వేల పింఛను రూ.15వేలకు పెంచి ఇవ్వాలంటూ కలెక్టరును అబ్బులు భార్య, పిల్లలు మొరపెట్టుకున్నారు. కలెక్టర్ మాట్లాడి కుటుంబానికి న్యాయం చేసే విధంగా కృషిచేస్తామన్నారు.


పింఛను పెంచాలని కోరుతున్న బాధితుడు

● తమకు రెండు నెలలుగా జీతాలు రావడంలేదని, దీనివల్ల తమ కుటుంబ పోషణ ఇబ్బందిగా మారిందని సమగ్రశిక్ష సిబ్బంది వినతిపత్రం అందజేశారు.

● మండపేటలో ముస్లింలకు శ్మశాన వాటిక స్థలం (ఖబరస్తాను)కు స్థలం కేటాయించాలని వినతి పత్రం అందించారు.

● 2024 ఎన్నికల్లో విధులు నిర్వర్తించిన ఫొటోగ్రాఫర్స్‌కు ఇవ్వాల్సిన డబ్బులు ఇప్పించాలని ప్రొఫెషనల్ ఫొటో, వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మండపేట జోన్ సభ్యులు విన్నవించారు.

● మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు నియోజకవర్గంలోని పలు సమస్యలను కలెక్టరు మహేష్‌కుమార్‌కు విన్నవించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి వేగుళ్ల లీలాకృష్ణ, జిల్లా గ్రంథాలయ మాజీ అధ్యక్షులు నల్లమిల్లి వీరెడ్డి కలెక్టరును కలిసిన వారిలో ఉన్నారు.

● ఎమ్మెల్సీ తోటత్రిమూర్తులు కలెక్టరును కలిసి పలు సమస్యలను తెలియజేశారు.


కలెక్టరును కలిసిన ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

● ఏడిద సీతానగరంలో జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా పైపులైన్లు వేశారని, ఇప్పటికీ నీరు విడుదల చేయలేదన్నారు. బోరు ఆపరేటర్‌కు రూ.1.08 లక్షలు జీతాలు ఇచ్చినట్లు అధికారులు తెలియచేశారని. పైపులైన్ల అవకతవకలపై చర్యలు చేపట్టాలని పెనుమత్స వెంకటవర్మరాజు, తదితరులు కలెక్టరును కోరారు.

● పాలతోడు గ్రామంలో అంత్యక్రియలకు ఇబ్బంది పడుతున్నామని శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని గ్రామానికి చెందిన పలువురు విన్నవించారు.

● మండపేటలో టిడ్కో ఇళ్ల సమస్య, రెవెన్యూ సమస్యలను దివ్యాంగుడు నందికోళ్ల రాజు కలెక్టరు దృష్టికి తెచ్చారు.

అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా భీమశంకరం

రామచంద్రపురం: అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వెంటపల్లి భీమశంకరం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బత్తుల సిద్దు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3న రంపచోడవరంలో జరిగిన రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌లో భీమశంకరం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నారు. పీడిత ప్రజల తరపున జరుగుతున్న పోరాటాలు, ఉద్యమాలకు అరుణోదయ అండగా నిలబడి కళారూపాలు, పాటలతో చైతన్యం తెస్తోందన్నారు. పోరాట స్ఫూర్తితో మరింత ఉత్సాహంగా సమాఖ్యను ముందుకు నడిపించేందుకు అందరితో కలసి కృషి చేస్తానని భీమశంకరం పేర్కొన్నారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

ద్వారపూడి, న్యూస్‌టుడే: ద్వారపూడి సెక్షన్ పరిధిలో మంగళవారం వ్యవసాయ విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ రవికుమార్ తెలిపారు. విద్యుత్తు మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 4 గంటల నుంచి సాయంత్రం 6వరకు అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

శీలంవారి సావరం పరిధిలో రేపు..

రామచంద్రపురం: పట్టణంలో 33/11 కేవీ శీలంవారి సావరం సబ్ స్టేషన్, ముచ్చుమిల్లి ఫీడర్ల మరమ్మతుల నిమిత్తం 9న ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ కె.రత్నాలరావు తెలిపారు. శీలంవారి సావరం, వైఎస్సార్ నగర్, రాజబాబు నగర్, గణేష్ నగర్, రాజగోపాల్ సెంటర్, ద్రాక్షారామ రోడ్డు, ఆర్యోస్, బీరుపరిశ్రమలు, వెల్ల వాటర్ వర్క్స్, సాయి నగర్, శాంతినగర్, డీఎస్పీ కార్యాలయం రోడ్డు, అగ్నిమాపక కార్యాలయం తోట వారి వీధి, బ్రాడీపేట, శ్రీరామ్‌పేట, గంగుమళ్లవారి వీధి, వాడపల్లివారి వీధి, తదితర ప్రాంతాల్లో సరఫరా ఉందన్నారు.

వరప్రదాయిని... జగజ్జననీ..


శివాలయం పార్కు వద్ద మహాచండి అలంకరణలో..



ఆదివారపుపేట బాలయోగి ఆశ్రమంలో..


వెదురుపాకలో విజయ దుర్గాదేవి


పామర్రులో మహాలక్ష్మి అలంకరణలో...

దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రముఖ శైవ క్షేత్రం కోటిపల్లిలో రాజరాజేశ్వరీదేవిని సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లోని గ్రామాల్లో అమ్మవార్లు వివిధ అలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాల్లో సామూహిక కుంకుమ పూజలు, లలితాసహస్ర నామ పారాయణలు చేశారు. రామచంద్రపురం కొత్తూరు రోడ్డులోని కనకదుర్గమ్మవారిని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

– న్యూస్‌టుడే, రామచంద్రపురం, ద్రాక్షారామ, పామర్రు, రాయవరం, మండపేట గ్రామీణం


అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ తోట


రామచంద్రపురంలో..


కన్యకాపరమేశ్వరి అమ్మవారు


కపిలేశ్వరపురంలో విజయవాడ బయలుదేరిన భక్తులు

ఇంద్రకీలాద్రికి భవానీల పాదయాత్ర

అంగర: కపిలేశ్వరపురం, అంగర గ్రామాల్లోని పలువురు భవాని భక్తులు సోమవారం కాలినడకన విజయవాడకు బయలుదేరారు. ఈ సందర్భంగా స్థానిక గురుభవానీల ఆధ్వర్యంలో ఆలయాల్లో పూజలు నిర్వహించి, దుర్గమ్మ సన్నిధికి పయనమయ్యారు. గ్రామాల్లో శక్తి వేషాలతో ఊరేగింపు నిర్వహించారు. రోజుకు 40 కిలోమీటర్ల చొప్పున ప్రయాణించి, విజయదశమి నాటికి విజయవాడకు చేరుకుంటామని భవాని భక్తులు తెలిపారు.


అంగర, మండపేట: ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఎమ్మెల్యేగా గెలిస్తే కాలినడకన విజయవాడ అమ్మవారి ఆలయానికి వస్తామని మొక్కుకున్న పలువురు తెదేపా నాయకులు సోమవారం బయలుదేరారు. కపిలేశ్వరపురం మండలం వాకతిప్ప గ్రామానికి చెందిన అల్లూరి రామకృష్ణ చౌదరి, కపిలేశ్వరపురం గ్రామానికి చెందిన పువ్వుల చిట్టి బాబులు మండపేటనుంచి పాదయాత్ర ప్రారంభించారు.

మండుతున్న కూరగాయల ధరలు

రకాలు (కిలో రూ.ల్లో)	రామచంద్ర పురం	మండపేట
ఉల్లిపాయలు	60	53
టమాటా	60	45
బీరకాయ	60	44
కాకరకాయ	40	34
వంకాయ	60	48
చిక్కుడు కాయ	140	90
బెండకాయ	60	36
దొండకాయ	60	46
క్యారెట్	50	46
బంగాళదుంపలు	50	36
పచ్చిమిర్చి	40	28
దోసకాయలు	50	34
క్యాబేజీ	45	26
అల్లం	100	65

న్యూస్‌టుడే, రామచంద్రపురం

అకాల వర్షాలు.. అక్టోబరు వచ్చిందంటే భవాని భక్తుల మాలలు, నవంబరు, డిసెంబరు నెలల్లో అయ్యప్ప మాల ధరించే భక్తులు ఇలా పండుగ రోజుల్లో కాయగూరలతో భోజనాలు పెరుగుతాయి. . వెరసి మార్కెట్లో కూరగాయల ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయి. రామచంద్రపురం పట్టణంలో రైతు బజారు నిర్మిస్తామని చెప్పి పురపాలక సంఘ స్థలాన్ని కేటాయించారు. రూ. 75లక్షల మార్కెటింగ్ శాఖ నిధులతో షెడ్లు నిర్మించారు. కానీ ఏడాది గడచినా ప్రారంభించలేదు. దీంతో పట్టణంలో ధరల నియంత్రణ కొరవడింది. కొన్ని కూరగాయలు మండపేట మార్కెట్‌తో పోలిస్తే కిలోకు రూ.20లు వ్యత్యాసం ఉంటుంది. ఇక రావులపాలెం, మడికి మార్కెట్ల ధరలతో పోలిస్తే సగానికి సగం ధర వ్యత్యాసం ఉంటుంది. అడిగితే రవాణా ఛార్జీలంటారు. రైతు బజారు ఏర్పాటు చేసి ధరలకు కళ్లెం వేయకపోతే ఇష్టాను సారంగా ధర పెంచుకుంటూ పోతున్నారని పలువురు పేర్కొంటున్నారు.



పండగ రోజుల్లో పెంచేస్తున్నారు



పండగ రోజుల్లోను, మాల ధరించిన రోజుల్లో రేట్లు మరింత పెరిగిపోతున్నాయి. ద్రాక్షారామ, రావులపాలెం, మండపేట, కాకినాడ రేట్లకంటే రామచంద్రపురం పట్టణంలో ధరలు చాలా ఎక్కువగా ఉంటున్నాయి. వాటిని అదుపు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- భవాని, గృహిణి, రామచంద్రపురం

రైతు బజారు ఏర్పాటు చేయాలి



జిల్లాలో అన్ని పట్టణాల్లోనూ రైతుబజార్లు ఉన్నాయి. రామచంద్రపురం పట్టణంలో రైతు బజారు ఏర్పాటు చేయడం లేదు. దీంతో ధరల నియంత్రణ లేకుండా పోయింది. ఇతర గ్రామాల్లో కొనుగోలు చేసిన కూరలకు, పట్టణంలో కొనుగోలు చేసిన ధరలకు చాలా వ్యత్యాసం వస్తుంది. అన్ని పట్టణాల్లో సమాన ధరలు ఉండేలా చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

- దాసరి కనకదుర్గ, గృహిణి, రామచంద్రపురం

ప్రజలకు సుపరిపాలన అందించాలి

పామర్రు: గ్రామ పంచాయతీల్లో జరిగే వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యకలాపాలను అవగాహన చేసుకుని ప్రజలకు సుపరిపాలన అందించాలని కె.గంగవరం ఎంపీడీవో కె.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని 26 గ్రామ పంచాయతీలకు చెందిన ఉపసర్పంచులు, ఇద్దరేసి వార్డు సభ్యులకు కె.గంగవరంలో సోమవారం శిక్షణను ఆయన ప్రారంభించారు. ఈవోపీఆర్డీ నాగేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

రాయవరం: మండల పరిషత్తు కార్యాలయంలో 12 గ్రామాలకు చెందిన ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు పంచాయతీ రాజ్ విస్తరణాధికారి ఎం.శ్రీనివాసరావు శిక్షణ ఇచ్చారు.

కార్యదర్శులకు సత్కారం

అంగర: కపిలేశ్వరపురం మండలం నుంచి ఇతర ప్రాంతాలకు బదిలీ అయిన పలువురు పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్తు సిబ్బందిని సోమవారం ఎంపీడీవో కె.రత్నకుమారి శాలువాలు, పూలమాలలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. సూపరింటెండెంట్ ప్రకాష్, పంచాయతీ కార్యదర్శులు సాకా రామకృష్ణ, పి.వెంకటేశులు, వీడీవీ లక్ష్మి, ఎస్.సాధారాణి, కె.రామకృష్ణ, టి.సుభాకర్, సీహెచ్‌వీవీ నరసింహారావు సత్కారం అందుకున్న వారిలో ఉన్నారు. సూపరింటెండెంట్ రాజేంద్రకుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.


పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీవో, సిబ్బంది

ఆర్డీవో కౌసర్‌బానో బాధ్యతల స్వీకరణ



రామచంద్రపురం, న్యూస్‌టుడే: రామచంద్రపురం రెవెన్యూ డివిజనల్ అధికారిగా కటీబ్ కౌసర్‌బానో సోమవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. కడప జిల్లాలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేసిన ఆమె బదిలీపై ఇక్కడికి ఆర్డీవోగా వచ్చారు.

ఎంపీడీవోలుగా..


పద్మజ్యోతి


రత్నకుమారి

ద్రాక్షారామ, అంగర: ఎంపీడీవోలుగా రామచంద్రపురంలో కె.పద్మజ్యోతి, కపిలేశ్వరపురంలో కె.రత్నకుమారి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గోకవరం నుంచి బదిలీపై వచ్చిన పద్మజ్యోతి ఐదేళ్ల క్రితం ఇదే మండలంలో ఈవోపీఆర్డీగా, ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా పనిచేశారు. ఇక్కడి ఎంపీడీవో కీర్తిస్పందన రాయవరం మండలానికి బదిలీపై వెళ్లారు.

రాయవరం: మండల పరిషత్తు అడ్మినిస్ట్రేటివ్ అధికారి (ఏవో) గా యామజాల నాగనటరాజ్‌గోపాల్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన సీతానగరం నుంచి రాగా, ఇక్కడి ఏవో డి.శ్రీనివాస్ గోకవరం బదిలీ అయ్యారు.

దోమల నివారణ మందు పిచికారీ


జగనన్న కాలనీలో మందు పిచికారీ చేయిస్తున్న ఆరోగ్య సిబ్బంది

అంగర, న్యూస్‌టుడే: 'దోమలకు ఆవాసంగా ఖాళీ స్థలాలు' పేరుతో ఈ నెల 5న ఈనాడులో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కపిలేశ్వరపురం మండలంలోని వల్లూరు, వడ్లమూరు గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో అచ్యుతాపురం పీహెచ్‌సీ సిబ్బంది పర్యటించి, జ్వరపీడితుల సర్వే నిర్వహించారు. వర్షం నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో దోమలు వ్యాప్తి చెందకుండా ఎబేటు మందు పిచికారీ చేయించారు. నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో చేపట్టాల్సి చర్యలపై కాలనీ వాసులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ ఈవో గోపాలకృష్ణ, వల్లూరు, వడ్లమూరు ఏఎన్ఎంలు సర్ణలత, విజయదుర్గ, ఆరోగ్య సహాయకుడు రవీంద్రకుమార్ పాల్గొన్నారు.

ఈనాడు కథనానికి స్పందన

పాదులు తొలగించారు

ద్వారపూడి: మండపేట మండలం జడ్.మేడపాడు నుంచి ద్వారపూడి వెళ్లే అనుసంధాన రహదారిలో విద్యుత్తు స్తంభానికి పచ్చని పాదులు అల్లుకుని తీగలను తాకుతుండడంతో వాటి ద్వారా విద్యుత్ ప్రవహించే అవకాశం ఉండటంతో స్థానికులు భయపడుతున్నారు. ఈ సమస్యలపై ఈనెల 7న 'పాదులను తొలగిస్తే మేలు' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి విద్యుత్తు శాఖ ఏఈ రవికుమార్ స్పందించారు. వెంటనే స్తంభానికి అల్లుకున్న పాదుల తొలగింపునకు చర్యలు తీసుకున్నారు. సమస్య పరిష్కారమవడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.